



సభలో ప్రసంగిస్తున్న పవన్‌కల్యాణ్, వేదికపై ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర, అంబటి రాయుడు, బీజేపీ నేత సత్యకుమార్ తదితరులు



పొన్నూరు పవన్‌కల్యాణ్ సభకు హాజరైన జన సందోహం

కులం కావాలా.. అభివృద్ధి కావాలా: పెమ్మసాని

ఒక్క ఛాన్సని మనం జగన్‌కు అధికారం ఇస్తే పోలవరం లేదు. రాజధాని లేదు, ప్రజల బత్తుకుకు భరోసా లేదు. తాగడానికి నీరులేదు. ఆస్తికి భద్రత లేదు.. అని గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఇక్కడ ఒక ఎంపీ, ఎమ్మెల్యే కులం గురించి మాట్లాడుతున్నారు. గుణం లేనివారే కులం గురించి మాట్లాడుతారు. మానవత్వం లేనివారే మతం గురించి మాట్లాడుతారన్నారు. గుణం కావాలో, అభివృద్ధి కావాలో ప్రజలే తేల్చుకోవాలన్నారు. మనిషి కష్టంలో ఉన్నప్పుడు చేయి అందించడం, భుజం తట్టడం, ఆత్మబంధువు మాత్రమే చేయగలడని అలాంటి ఆత్మబంధువు, నీతి నిజాయితికి ప్రతి రూపం పవన్‌కల్యాణ్ అన్నారు.



సూపర్ సిక్స్ పథకాలపై విద్యార్థినుల ప్రదర్శన



పొన్నూరు పోటెత్తింది..

- మండుటెండలో మహాజనం
- పవన్‌కల్యాణ్‌కు అపూర్వ స్వాగతం
- జనసంద్రంలా వారాహి విజయభేరి సభ

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): మండే ఎండ అయినా అభిమాన నేత కోసం పోటెత్తిన జనం. మూడు గంటల ఆలస్యమైనా విసిగిపోకుండా ఉరిమే ఉత్సాహం తొణికిసలాడింది. భానుడి భగభగల మధ్యే జనసేనానికి అభిమాన జనం అపూర్వ స్వాగతం పలికింది. వారాహి విజయభేరి యాత్రలో భాగంగా ఆదివారం పొన్నూరులో పవన్‌కల్యాణ్ పర్యటించారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని నిర్వాహకులు ప్రకటించగా మూడు గంటల ఆలస్యంగా పవన్ పొన్నూరు వచ్చారు. అప్పటికే టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు, పవన్ అభిమానులు రాకతో పొన్నూరు వీధులు జన ప్రవాహాన్ని తలపించాయి. ఎటు చూసినా ఉరకలెత్తే ఉత్సాహంతో యువకులు, మహిళలు, చిన్నారులు జయజయధ్వానాల మధ్య పవన్ రోడ్ షో జరిగింది. తొలుత ఆయన సజ్జా ఫంక్షన్ హాల్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు రాగా అక్కడ నుంచి రెండు కిలోమీటర్ల మేర పట్టణ వీధుల్లో రోడ్ షో జరగ్గా అడుగడుగునా యువకులు పవన్ కళ్యాణ్‌కు బ్రహ్మరథం పట్టారు. సభా ప్రాంగణానికి పవన్ చేరుకునే సరికి ఆ ప్రాంతం జనంతో కిటకిటలాడిపోయింది. మండుటెండను సైతం లెక్క చేయని టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులను చూసి పవన్ ఉద్వేగపూరితమైన ప్రసంగం చేశారు. వైసీపీ పాలనపైన, నేతల అరాచకాలు, దోపిడీపై ధ్వజమెత్తారు. గుంటూరు కారం ఘాటు నా రక్తంలోనే ఉందంటూ పవన్ సీఎం జగన్‌కు హెచ్చరికలు పంపారు. ఈ కార్యక్రమంలో లోక్‌సభ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, పొన్నూరు అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర, జనసేన, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, వనమా నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ధర్మానిదే విజయం..

గుర్రం జాషువా, ఆచార్య రంగా, చేనేత ప్రతినిధి ప్రగడ కోటయ్య నడయాడిన గడ్డమీద ఉండి చెబుతున్నా ధర్మానిదే విజయం.. కూటమిదే గెలుపు అని పవన్ తేల్చిచెప్పారు. 2021 మార్చి 14న ఇప్పటం గ్రామంలో చెప్పినట్లుగా వైసీపీ వ్యతిరేక ఓటు చీలనివ్వన న్నారు. ఓటు చీలకుండా ఉంటేనే 5 కోట్ల ఆంధ్రుల బతుకు బాగుంటుందన్నారు. వైసీపీకి మద్దతుగా ఉన్న వారు కూడా ఆలోచించుకోండి అంటూ బర్నబస్, అమర్నాథ్ ఉదంతాలను వివరించారు. రోడ్లపై గోతులు.. మాట్లాడితే దాడులు.. నోట్లో నుంచి బూతులు, ఎర్రమట్టి దోపిడీలు తప్ప వైసీపీ మనకు ఏమిచ్చిందంటూ ఆ పార్టీ నేతలను నిలదీశారు. కష్టజీవులను, కండ కరిగించే రైతు కష్టాన్ని దోచి క్లాస్ వార్ అంటున్నారు.. ఇదెక్కడి దుర్మార్గం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రశంసలు..

సంగం డెయిరీని మూసేయించి పాల ఉత్పత్తిలో గుత్తాధిపత్యం తేవాలని చూసిన జగన్‌కు ధూళిపాళ్ల నరేంద్ర సరైన సమాధానం చెప్పారన్నారు. ఐదేళ్లు పోరాడి, జైలుకు వెళ్లి పాడి రైతుల ఉపాధికి బాసటగా నిలిచారన్నారు. ఆయన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. నా మోచేతి నీళ్లు తాగాలి అని జగన్ అంటే.. ఆత్మగౌరవమున్న అంబటి రాయుడు కాదపొమ్మన్నాడని ప్రశంసించారు. ఎంపీ అభ్యర్థి పెమ్మసాని తెలుగు మాతృభాషలో చదివి ప్రపంచస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. నిజాయితీ, చిత్తశుద్ధి ఉన్న నాయకులు లోక్‌సభకు వెళ్లాలని నేను ఆయనకు మద్దతుగా వచ్చానన్నారు. స్వదేశ్ సినిమాలో షారూక్ ఖాన్‌లాగా నాగుంటూరు బాగుండాలి, నాఆంధ్రా బాగుండాలని పెమ్మసాని అమెరికా నుంచి దేశానికి వచ్చాడని, ఆయన కుడబ్బుకన్నా వేల రెట్లు ధైర్యం ఉందని ప్రశంసించారు.



టీడీపీ, జనసేన జెండాలతో కొబ్బరిచెట్టుపై కూర్చుని..

రూ.2 వేల కోట్ల మట్టి దోపిడీ

పొన్నూరులో 700 ఎకరాల్లో ఎర్ర మట్టి గ్రావెల్ తవ్వి ఇక్కడి ఎమ్మెల్యే, ఇప్పటి ఎంపీ అభ్యర్థి 2 వేల కోట్లు దోచేశారని పవన్ ఆరోపించారు. ఉమ్మారెడ్డి కుటుంబం నుంచి వచ్చిన వారు ఇంత దోపిడీ చేస్తారా అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కిలారి దోపిడీ మకిలి ఉమ్మారెడ్డికీ అంటక తప్పదన్నారు. పొన్నూరులో 12 లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులు ఆపేశారని తెలిపారు. రేషన్ పెద్ద మాఫియా లా తయారైందని పొన్నూరు నుంచి కాకినాడలోని ద్వారంపూడి చంద్రశేఖర్ ద్వారా బియ్యాన్ని ఆఫ్రికాకు తరలిస్తున్నారని ఆరోపించారు.

వైసీపీని క్లీన్ బౌల్డ్ చేయండి : రాయుడు

వైసీపీ వారి మాట నమ్మకండి. వారికి కావాల్సింది బానిసత్వమే. మీరు పేదరికంలో ఉండటమే వారికి కావాలి. అదే వారి బలం. కాబట్టి వారికి దూరంగా ఉండండి. కూటమి అభ్యర్థులకు ఓటేయండి. అది పవనన్నకే ఓటేసినట్లు అవుతుందని మాజీ క్రికెటర్ అంబటి రాయుడు చెప్పారు. వైసీపీని క్లీన్ బౌల్డ్ చేసే అవకాశం ప్రతి ఒక్కరికి వచ్చింది. వినియోగించుకోండి. చేతులు జోడించి అడుగు తున్నా.. రాష్ట్రాన్ని కాపాడండి అని రాయుడు విజ్ఞప్తి చేశారు.



కాలిపోయిన వాహనాలను పరిశీలిస్తున్న డాక్టర్ పెమ్మసాని, నసీర్, మ్యాని, షౌకత్

నిన్న సహకరించలేదని.. నేడు మంట

- వైసీపీ దాష్టీకం 7 షాపులు, 40 కార్లు బుగ్గిపాలు
- ఆటోనగర్‌లో టీడీపీ ముస్లింల దుకాణాలే లక్ష్యంగా నిప్పు

పెదకాకాని, మే 5: శనివారం స్థానిక ఆటోనగర్‌లో వైసీపీ అభ్యర్థి తరఫున ఎమ్మెల్యే ముస్తఫా, ఆయన అనుచరులు ప్రచారానికి రాగా సహకరించలేదని తీవ్రస్థాయిలో దూషించారు.. ఆదివారం టీడీపీ ముస్లింల దుకాణాలే లక్ష్యంగా నిప్పు పెట్టారు. ఏడు దుకాణాలు, 40 కార్లు, ఇతర సామగ్రి బుగ్గిపాలైంది. ఘటనను ప్రమాదంగా చిత్రీకరించాలని కొందరు ప్రయత్నించినప్పటికీ, ఉద్దేశపూర్వ కంగానే దహనం చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. వైసీపీ పర్యటనకు సహకరించలేదనే కక్షతోనే ఈ ప్రమాదం సృష్టించారన్నారు. ఘటన విషయం తెలియగానే లోక్‌సభ, తూర్పు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థులు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, నసీర్ ఆదివారం బాధితులను పరామర్శించారు. జరిగిన ఘటనపై ఇప్పటికే ఐజీకి ఫిర్యాదు చేసినట్లు పెమ్మసాని విలేకర్లకు తెలిపారు. కారకులు ఎవరైనా సరే టీడీపీ ప్రభుత్వం రాగానే కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. టీడీపీకి మద్దతు ఇచ్చారన్న కక్షతోనే వైసీపీ మూకలు వారి దుకాణాలకు నిప్పు పెట్టారని మహమ్మద్ నసీర్ తెలిపారు. ఎమ్మెల్యే అనుచరులే ఈ ప్రమాదానికి కారణమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నంబూరు సుభాని, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దిరాల మ్యాని, నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, షేక్ షౌకత్, ఈడే మురళీకృష్ణ, భీమనాథం భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

సర్వం కోల్పోయాను..

ఇది ముమ్మాటికీ వైసీపీ నాయకుల పనే. దుకాణానికి నిప్పు పెట్టడంతో సర్వం కోల్పోయాను. తాము వైసీపీ ఎమ్మెల్యే ముస్తఫా సమావేశానికి వెళ్లలేదని, ఆ కోపంతో ఆ పార్టీకి చెందిన వారే మా దుకాణాలకు నిప్పు పెట్టి ఉంటారు. జీవనం ఎలా సాగించాలి.

- మహబూబ్ బాషా



కాలిపోయిన పాత కార్లు

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభం

- గుంటూరు, పొన్నూరులో గందరగోళం



మహిళా కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు వచ్చిన ఉద్యోగులు

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రారంభమైంది. ఆదివారం ఉదయం ఫెసిలిటేషన్ సెంటర్ల వద్దనే ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లకు రెండో విడత శిక్షణ తరగతుల అనంతరం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు అనుమతించారు. దీంతో ఉద్యోగుల ఓటు ఏ నియోజకవర్గంలో ఉంటే సంబంధిత కౌంటర్ వద్దకు వెళ్లి ఓటు వేశారు. ఇతర జిల్లాల్లో ఓటు ఉండి ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వారికి మాత్రం ప్రత్యేకంగా బాక్సు పెట్టారు. పోస్టల్ బ్యాలెట్ సందర్భంగా ప్రభుత్వ మహిళ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్ వద్ద గందరగోళానికి దారి తీసింది. మాచర్లలో ఓటు ఉన్న ఉద్యోగి గుంటూరు పశ్చిమలో విధులు నిర్వహిస్తున్నారు. ఆమె తన పోస్టల్ బ్యాలెట్ ఇవ్వాలని కోరగా అందుకు మీరు అక్కడికి వెళ్లండి, ఇక్కడికి వెళ్లండంటూ తిప్పారు. ఒక అధికారిని సంప్రదిస్తే ఆమె కసురుకున్నట్లు వాపోయారు. పొన్నూరులో పోలింగ్ కేంద్రం నిర్వహణపై ఉద్యోగులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పొన్నూరు నుంచి 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న వీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శిక్షణ జరగ్గా పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఓటింగ్ కేంద్రం ఏర్పాటు చేయడంతో ఉద్యోగులు తీవ్ర వ్యయప్రయాసలకు గురయ్యారు.

నీట్.. 98 శాతం

వైద్య కళాశాలల్లో ప్రవేశం కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నేషనల్ ఎలిజి బులిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. గుంటూరులో ఏర్పాటు చేసిన 10 కేంద్రాల్లో 98శాతం విద్యార్థులు హాజరయ్యారు.

- గుంటూరు(విద్య)



గుంటూరు: పరీక్షా కేంద్రంలో బారులు తీరిన విద్యార్థినులు

ఇద్దరూ.. ఇద్దరే

- రాజకీయాల్లో కొత్త ఒరవడికి శ్రీకారం
- సిట్టింగ్ ఎంపీగా ఇప్పటికే ఒకరు నిరూపించుకున్నారు...
- తొలి అడుగుతోనే మరొకరు ప్రభంజనం సృష్టించబోతున్నారు..


లావు శ్రీకృష్ణదేవరాయులు పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, మే5(ఆంధ్రజ్యోతి): సాధారణంగా రాజకీయాల్లోకి వచ్చి సంపాదించుకునే వారినే ఎక్కువగా చూస్తుంటాం. అలాకాకుండా తరతరాలకు సరిపడా ఆస్తిని సంపాదించుకొని సమాజానికి మేలు చేయాలనే సేవా నిరతితో రాజకీయాల్లోకి వచ్చేవారు ఎంతో అరుదు. అటువంటి జాబితాలో ఉమ్మడిగుంటూరు జిల్లాలోని గుంటూరు, నరసరావుపేట లోక్‌సభ స్థానాల నుంచి టీడీపీ అభ్యర్థులుగా ఎన్నికల బరిలోకి దిగిన విద్యావంతులు, యువకులు అయిన డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, లావు శ్రీకృష్ణదేవరాయులు చోటుపొందారు. వీరిలో ఒకరైన శ్రీకృష్ణదేవరాయులు ఇప్పటికే సిట్టింగ్ ఎంపీగా వ్యవహరిస్తూ ఈ ఐదేళ్ళలో తన నిజాయితీని, సేవాతత్పరతను చాటుకున్నారు. విద్యావంతుడైన కృష్ణదేవరాయులు ఉమ్మడి రాష్ట్రంలోకే పేరొందిన విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత లావు రత్తయ్య కుమారుడు. కృష్ణదేవరాయులు ఆ సంస్థల వైస్ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్నారు. ఇతను కూడా శ్రీమంతుడే. మొదటి అడుగు వైసీపీ ద్వారా వేసి ఎంపీగా గెలుపొందినప్పటికీ తన పంథాకు, విలువలకు భంగం కలగకుండా ఇప్పటివరకు పయనం సాగించటం విశేషం. వైసీపీ భావజాలాలు ముఖ్యంగా ప్రత్యర్థులపైనే కాకుండా వారి కుటుంబీకులపై సైతం బూతులు తిట్టే సంప్రదాయం నచ్చక ఆ పార్టీని వీడి టీడీపీలో చేరి అదే నరసరావుపేట నియోజకవర్గం నుంచి టీడీపీ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. గత ఐదేళ్ళలో తన లోక్‌సభ నియోజకవర్గం ప్రజల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి తనకు ఎటువంటి సహకారం లభించనప్పటికీ నేరుగా కేంద్ర మంత్రులతో పరిచయాలు పెట్టుకొని వారి సహకారంతో పల్నాడు ప్రాంతంలో తనదైన అభివృద్ధి మార్కు కొంతమేరకు వేసుకో గలిగారు. పలు అభివృద్ధి కార్యక్రమాలు తన ద్వారా ప్రారంభమై మధ్యలో ఉండటంతో తిరిగి అవి కొనసాగించాలంటే అదే నియోజకవర్గం నుంచి తిరిగి ఎంపీగా గెలిస్తే సాధ్యమవుతుందని భావించాడు. అయితే వైసీపీ అధిష్టానం అతన్ని గుంటూరు పార్లమెంటు నుంచి పోటీ చేయమని ఆదేశించటంతో ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. అదే సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు లావుకు నరసరావుపేట నుంచి పోటీ చేసే అవకాశం కల్పించారు. వైసీపీలో కొనసాగినా విలువలతో వ్యవహరించటం వల్ల చంద్రబాబుకు లావు నచ్చారు. అంతేకాదు వైసీపీ ఎంపీగా కొనసాగుతూ కూడా కోస్తాంధ్రలో ఏ వైసీపీ నేత చేయని సాహసం ఆయన చేశారు. అమరావతి ఏకైక రాజధానిగా ఉండాలని ఉద్యమంచేస్తున్న రైతులశిబిరం వద్దకు కృష్ణదేవరాయులు వెళ్ళి వారికి మద్దతు పలికారు. ఆ చర్య వైసీపీ అధిష్టా నానికి కంటగింపయింది. అందుకే ఆయన ను పొమ్మనకుండా పొగబెట్టి పంపేశారు. తిరిగి తనను గెలిపిస్తే పల్నాడును సిరుల మాగాణిగా మారుస్తాననే నినాదంతో ఆయన ప్రచారంలో తనదైన పందాలో దూసుకుపోతున్నారు.

తొలి అడుగుతోనే... అమెరికాలో స్థిరపడి వేలకోట్ల ఆస్తి గడించి కూడా జన్మభూమి రుణం తీర్చుకోవాలనే సదాశయంతో రాజకీయాల్లోకి తొలి అడుగు వేసి గుంటూరు టీడీపీ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ రాజకీయాల్లో ఓ ప్రభంజనంలా దూసుకుపోతున్నారు. నామినేషన్ దాఖలు సమయంలో తన ఆస్తిపాస్తులను వివరించటంతో ఒక్కసారిగా రాష్ట్రం మొత్తం ఉలిక్కిపడింది. రూ.5,705 కోట్లు తన ఆస్తిగా చూపి దేశంలోని సంపన్న ఎంపీ అభ్యర్థుల్లో ఒకడిగా నిలిచిన పెమ్మసాని కేవలం కొద్దినెలల్లోనే తనదైన వ్యవహారశైలితో పార్టీ శ్రేణులకు దగ్గరయ్యారు. అంతే కాదు ఎన్నికల ప్రచార సభల్లో తన తీరు, మాటలతో సామాన్య ప్రజల్లో సైతం ఓ నమ్మకం కలుగచేయగలిగారు. కొద్ది సమయంలోనే లోక్‌సభ స్థానంపరిధిలో అన్ని అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఇప్పటికే రెండు, మూడు పర్యాయాలు విస్తృతంగా పర్యటించి ఒక క్రేజ్ సృష్టించుకున్నారు. తన లోక్‌సభ స్థానం పరిధిలో బరిలో నిలిచిన ఎమ్మెల్యే అభ్యర్థులతో ఎంతో కలివిడిగా కలిసిపోతూ తాను ఎంతో సంపన్నవంతుడిని అనే గర్వం ఏ కోశానా లేకుండా వారికి సైతం ఎంతో ఆత్మీయుడైపోయారు. తనది తొలి అడుగుగా చెప్పుకుంటూ లోక్‌సభ స్థానంలో అడుగు పెట్టినప్పటికీ ఎంతో ఆరితేరిన నాయకుడిలా పార్టీకి దూరంగా ఉంటున్న వారిని ఎంతో మందిని తిరిగి కార్యోన్ముఖులుగా చేయగలిగారు. వైసీపీని వీడినప్పటికీ తటస్థంగా ఉంటున్న నియోజకవర్గ స్థాయి నేతలతో సైతం దౌత్యం నడిపి టీడీపీ అధికారంలోకి వస్తే తగిన ప్రాధాన్యం ఇస్తామనే భరోసాతో వారిని పార్టీలో చేరేలా చేశారు. తొలి నాళ్ళలో విమర్శలు చేసిన ప్రత్యర్థి పార్టీల వారిని సైతం ముక్కున వేలేసుకునేలా చేశారు. తనను గెలిపిస్తే రాజకీయాల్లో నూతన ఒరవడికి తన వంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ప్రచారంలో పెమ్మసాని దూసుకుపోతున్నారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరిస్తాం

- నారా బ్రాహ్మణి • మత్స్యకార మహిళలతో మాటామంతి


మత్స్యకార మహిళలతో మాట్లాడుతున్న నారా బ్రాహ్మణి

మంగళగిరి, మే5: ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే నియోజకవర్గంలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని నారా బ్రాహ్మణి అన్నారు. ఉండవల్లి పీడబ్ల్యూడీ వర్కుషాపు వద్ద కృష్ణాతీరం వెంబడి వున్న మత్స్యకారులను ఆమె ఆదివారం ఉదయం కలుసుకున్నారు. వారి సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. చంద్రబాబు హయాంలో చేపలు పట్టుకునేందుకు రెండెకరాల స్థలం కేటాయించారని, కానీ ఇందులో గత అయిదేళ్లలో మార్కెట్‌ను నిర్మించకపోవడంతో తాము అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని మత్స్యకారులు చెప్పారు. కరోనా సమయంలో నారా లోకేశ్ తమకు భోజనాలను పెట్టించడంతోపాటు తమ ప్రతీ కుటుంబానికి నిత్యావసర సరుకులను పంపిణీ చేయించారన్నారు. తమకు నివేశన స్థలాలను ఇప్పించాలని, చేపల మార్కెట్ నిర్మాణం చేయించాలని, వేటలేని సమయంలో ప్రత్యామ్నాయ ఉపాధిని కల్పించాలని, తమ బిడ్డల వివాహాలను జరిపించుకోవడానికి వీలుగా కళ్యాణ మండపాన్ని కట్టించి ఇవ్వాలని మత్స్యకారులు బ్రాహ్మణికి విజ్ఞప్తిచేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారి సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని, నివేశనస్థలాల పంపిణీతోపాటు కమ్యూనిటీ హాలును నిర్మించి ఇస్తామని హామీలనిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, ఎంటీఎంసీ అధ్యక్షులు మునగపాటి వెంకట మారుతీరావు, జంజనం వెంకట సాంబశివరావు, సామల నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు నందం అబద్దయ్య, దామర్ల రాజు, సంకా బాలాజీ గుప్తా, చావలి ఉల్లయ్య, కొత్తపల్లి శ్రీనివాసరావు, ఆకుల జయసత్య, ఆరుద్ర భూలక్ష్మి, కొమ్మారెడ్డి వీరారెడ్డి, రంగిశెట్టి పెద్దబ్బాయి తదితరులు పాల్గొన్నారు.


ముప్పాళ్లలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కన్నా, లావు

ప్రతి గ్రామానికి తాగు, సాగు నీరు

- ఎన్నికల ప్రచారంలో శ్రీకృష్ణదేవరాయలు, కన్నా లక్ష్మీనారాయణ

ముప్పాళ్ళ మే 5: పలనాడు ప్రాంత ప్రజలకు తాగు, సాగు నీరు అందించడమే లక్ష్యం అని నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. ఆదివారం ముప్పాళ్ల మండలంలోని నార్నెపాడు, తొండపి గ్రామాల్లో కన్నా లక్ష్మీనారాయణతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. లావు మాట్లడుతూ.. నేడు రాష్ట్రంలో అధర్మం రాజ్యమేలుతుందని, ధర్మరక్షణకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఏర్పడిందన్నారు. కన్నా మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉద్యోగాలు రావావాలన్నా, రాష్ట్రాభివృద్ధి జరిగి ప్రజలు సంక్షేమంగా జీవించాలన్నా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైసీపీ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలను దారుణంగా మోసం చేసిందన్నారు. అందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో ఆ పార్టీని వీడి టీడీపీలో చేరుతున్నారని, రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రజల ఓట్ల సునామీలో గల్లంతవం ఖాయమని అన్నారు. అన్ని రకాల ధరల భారాలు, పన్నుల పెంపుతో వైసీపీ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. అనంతరం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్ళి టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలను ప్రజలకు వివరించారు. కూటమిని గెలిపించాలని కోరారు. ముందుగా గ్రామంలో ప్రచారానికి వచ్చిన కన్నా లక్ష్మీనారాయణకు, లావు శ్రీకృష్ణ దేవరాయలులకు మహిళలు హారతులిచ్చి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో లావు శ్రీకృష్ణ దేవరాయలు తండ్రి లావు రత్తయ్య, బొర్రా వెంకటప్పారావు, టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు టీడీపీ, జనసేన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుటుంబం.. ప్రచారం

- తండ్రికి మద్దతుగా ప్రత్తిపాటి స్వాతి
- భర్తకు మద్దతుగా లావు మేఘన ఎన్నికల ప్రచారం

చిలకలూరిపేట, మే5:తండ్రికి మద్దతుగా ప్రత్తిపాటిస్వాతి, భర్తకి చేదోడుగా లావు మేఘన చేపట్టిన ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నది. చిలకలూరిపేటఅసెంబ్లీ, నరసరావుపేట ఎంపీ టీడీపీ అభ్యర్థులు ప్రత్తిపాటి పుల్లారావు, లావు శ్రీకృష్ణదేవరాయలు తరపున జరిపిన ప్రచారంలో వారిద్దరు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆదివారం చిలకలూరిపేట మండలం రాజాపేటలో తండ్రిసన్నిధి, పట్టణంలోని శాంతినిలయం చర్చిలను ప్రత్తిపాటి స్వాతి, లావు మేఘన సందర్శించారు. ప్రార్థనా మందిరం వ్యవస్థాపకుడు, ప్రముఖ పాస్టర్ షాలెంరాజు, శాంతినిలయం పాస్టర్ బ్రదర్ క్రిస్టఫర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రార్థనల్లో వారుపాల్గొన్నారు. క్రైస్తవులతో కలిసి ప్రార్థనలు చేశారు. ప్రత్తిపాటి, లావు శ్రీకృష్ణదేవరాయలు విజయాన్ని కాంక్షిస్తూ ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రత్తిపాటి స్వాతి గతంలో ఎమ్మెల్యే, మంత్రిగా పనిచేసిన ప్రత్తిపాటి పుల్లారావు చిలకలూరిపేటను అన్ని విధాలా అభివృద్ధి చేశారన్నారు. ప్రత్తిపాటి మరోసారి గెలిపిస్తే అభివృద్ధిలో చిలకలూరిపేటను అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తారని, ప్రజలకు మేలు చేస్తారని తెలిపారు. అనంతరం లావు మేఘన మాట్లాడుతూ ఎన్నికలలో పోటీ చేస్తున్న వ్యక్తి నీతిపరుడా, అవినీతిపరుడా, అందుబాటులో ఉంటారా లేదా, మన పల్నాడును అభివృద్ధి చేయగలుగుతారా లేదా అనిచూసి నిర్ణయం తీసుకోవాలన్నారు. వీళ్లు నాయకులుగా ఉంటే రేపు మన పిల్లల భవిష్యత్తు బాగుంటుందా లేదా అనేది కూడా ఒకసారి ఆలోచించాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు, ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలుకు అందరి ఆశీస్సులు కావాలని వారు ప్రజలను కోరారు.


ప్రార్థనలలో పాల్గొన్న ప్రత్తిపాటి స్వాతి, లావు మేఘన


కేంద్రాల్లోకి వస్తున్న విద్యార్థులు

పరీక్షకు ముందుగా విద్యార్థిని ఫేషియల్ అటెండెన్స్ తీసుకుంటున్న సిబ్బంది

'నీట్'గా ముగిసింది

- 98 శాతం విద్యార్థులు హాజరు
- ఫేషియల్స్, బయోమెట్రిక్ అటెండెన్స్‌తో తనిఖీ

గుంటూరు(విద్య),మే 5: వైద్య కళాశాలల్లో ప్రవేశం కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జాతీయస్థాయిలో నిర్వహించిన నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని మొత్తం 10 కేంద్రాల్లో 4466 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 4248 మంది (98 శాతం) హాజరయ్యారు. విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి 1.30 నుంచే అనుమతించారు. మధ్యాహ్నం 2 గంటలకు పరీక్ష ప్రారంభమై సాయంత్రం 5.30వరకు జరిగింది. పరీక్షా కేంద్రంలోని అనుమతించే ముందు విద్యార్థులను ఫేషియల్, బయోమెట్రిక్ అటెండెన్స్ విధానం ద్వారా గుర్తించి కేంద్రాల్లోకి పంపారు. ఎండ వేడిమికి విద్యార్థులు కొంత అసౌకర్యానికి గురయ్యారు.



పిడుగుపడి 59 మేకలు మృతి

- ఇద్దరు కాపరులకు అస్వస్థత

దుర్గి, మే 5: పిడుగుపడి 59 మేకలు మృతిచెందగా ఇరువురు మేకల కాపరులు అస్వస్థతకు గురయ్యారు. మండలంలోని కాకిరాలకు చెందిన కొంగ గంగయ్య, గోవిందు, బూదూరు లక్ష్మయ్యలు ఆదివారం తమకు చెందిన సుమారు 200 మేకలను మేత కోసం గ్రామ శివారులోని అడివికి తీసుకొచ్చారు. సాయంత్రం సమయంలో అకస్మాత్తుగా పిడుగులతో కూడిన వర్షం పడడంతో మేకలతో సహా చెట్టు కిందకు చేరారు. అయితే చెట్టుపై పిడుగుపడడంతో 59 మేకలు అక్కడికక్కడే మృతిచెందాయి. గోవిందు, లక్ష్మయ్యలకు స్పృహ కోల్పోయారు. వారికి సమీపంలోనే ఉన్న గంగయ్య గ్రామస్తులకు సమాచారం అందించారు. గోవిందు, లక్ష్మయ్యలను మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు చికిత్సనందిస్తున్నారు. మరణించిన మేకల విలువ రూ.10 లక్షల వరకు ఉంటుందని బాధితులు బోరున విలపించారు.

రెండు పాడి గేదెలు మృతి

రెంటచింతల: రెంటచింతలలోని ఓకోల్డ్ స్టోరేజ్ సమీపంలో పిడుగుపాటుకు రెండు పాడి గేదెలు మృతి చెందిన ఘటన ఆదివారం సంభవించింది. రెంటచింతలకు చెందినబోయిన గురులింగం తన గేదెలను పొలంకు తోలాడు.. సాయంత్రం 4గంటల సమయంలో కురిసిన కొద్దిపాటి వర్షానికి తోడు పిడుగులు పడడంతో రెండు పాడి గేదెలు అక్కడికక్కడే ప్రాణాలిడిచాయి. వీటి విలువ రూ.1.45 లక్షలు దాకా ఉంటుందని బాధితుడు చెప్పాడు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభం

కారంపూడి: ఈదురు గాలులతో కురిసిన వర్షానికి మండలంలోని పేటసన్నిగండ్లలో విద్యుత్ స్తంభం నేలకొరిగింది. దీంతో మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

మద్యం, ఇన్నోవా కారు సీజ్

గుంటూరు(తూర్పు),మే5: సార్వత్రిక ఎన్నికలనేపథ్యంలో జిల్లాలో ఆదివారం ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో రూ.6,650 విలువగల 7లీటర్ల మద్యం, ఒక ఇన్నోవా కారు, మంగళగిరి నియోజకవర్గ పరిధిలో రూ.28,524 విలువగల 571 పార్టీ కరపత్రాలు, టీ షర్టులు, రూ.4,660 విలువ గల 7.55 లీటర్ల మద్యం, తాడికొండ నియోజకవర్గ పరిధిలో రూ.1,47,360 విలువ గల 198.7 లీటర్ల మద్యం సీజ్ చేసినట్టు అధికారులు తెలిపారు. జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో జరిగిన తనిఖీలలో మే 5న సాయంత్రం 6 గంటల వరకు రూ.3,11,70,891 విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేసినట్టు పేర్కొన్నారు.

మా జీవితాలను నాశనం చేశారు

- 1601వ రోజుకు చేరుకున్న ఆందోళనలు

తుళ్లూరు, మే 5: రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణం కోసం జీవనాధారమైన 33వేల ఎకరాల భూములిస్తే.. మూడు రాజధానులని రైతుల జీవితాలను సీఎం జగన్‌రెడ్డి నాశనం చేశాడని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క రూపాయి తీసుకోకుండా భూములిచ్చామన్నారు. వైసీపీ పాలకులు ఒక్క సెంటు ప్రజా అవసరాల కోసం భూమినివ్వమంటే ఇస్తారా.. అని ప్రశ్నించారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రెతుకూలీలు, మహిళలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద చేస్తున్న నిరసనలు ఆదివారం నాటికి 1601వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. వైసీపీకి ఓటు వేస్తే జీవితాలు చేతులారా నాశనం చేసుకున్నట్లేనని స్పష్టం చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.



వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

కూటమితోనే బీసీలకు రక్షణ

- బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు


మనోహర్ సమక్షంలో కూటమికి ఐక్యంగా మద్దతు తెలుపుతున్న బీసీ నేతలు

తెనాలి రూరల్, మే 05: బీసీ కులానికి చెందిన 10వ తరగతి విద్యార్థి అమర్‌నాథ్ ఏం తప్పుచేశాడని దారుణంగా చంపారు. తన అక్కను వైసీపీకి చెందిన ఆకతాయిలు వేధిస్తున్నారన్న బాధతో వారిని నిలువరించే ప్రయత్నం చేయడమే నేరమా.. కాళ్లు చేతులు కట్టి మానవత్వం మరిచి పంటపొలాల్లో అతడిపై పెట్రోల్ పోసి కర్కసంగా నిప్పుపెట్టిచంపుతారా.. ఇదేనా వైసీపీ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బీసీలకు ఉన్న రక్షణ..? అని బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ప్రశ్నించారు. ఆదివారం పట్టణంలోని నూకల రామకోటేశ్వరరావు కల్యాణ మండపంలో నిర్వహించిన బీసీల ఆత్మీయ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎన్డీఏ కూటమి తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌కు బీసీ సంక్షేమ సంఘం తరపున మద్దతు తెలుపుతూ ఆయన ప్రసంగించారు. బడుగు బలహీన వర్గాలైన బీసీలకు మంచి చేస్తానని ప్రజలను నమ్మబలుకుతూ ఒక్క చాన్స్ ఇస్తే బీసీల సంక్షేమానికి ఉన్న పలు పథకాలను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బీసీలపై దాడులు, దౌర్జన్యాలు, హత్యాయత్నాలు, అక్రమ కేసులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో బీసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికలలో బీసీలంతా ఐకమత్యంగా ఉంటూ తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థులకు మద్దతు తెలిపి గెలిపించాలన్నారు.

ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా విధ్వంస పాలనకు జగన్ మోహన్‌రెడ్డి తెరలేపారని అందుకు ఐదేళ్ల వైసీపీ పాలనే సాక్ష్యంగా నిలుస్తుదన్నారు. మూడు రాజధానులు అంటూ ప్రాంతాల మధ్య ప్రజల్లో చిచ్చుపెట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు. జగన్ అధికారంలోకి వచ్చాక బీసీల కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు చేసిందేమిలేదని తెలుపుతూ ఎన్నికలు సమీపిస్తుండటంతో నా బీసీలు, నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా మైనార్టీలు అంటూ లేని ప్రేమను ఉన్నట్లు నమ్మబలికే ప్రయత్నం చేస్తున్నాడని విమర్శించారు. బీసీలకు రక్షణ చట్టం, వారి అభ్యున్నతికి పాటుబడేది ఒక్క కూటమి ప్రభుత్వమేనని అన్నారు. తొలుత బీసీ సంక్షేమ సంఘం తరపున నాయకులు మనోహర్‌ను ఘనంగా సత్కరించి అందరం ఐకమత్యంగా ఉంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం వైపు నడిపే కూటమి అభ్యర్థులను గెలిపించుకుందామని చేతులు కలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘం పెద్దలు, సభ్యులు, పలువురు ఉమ్మడి పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

11 చంద్రబాబు ప్రజాగళం

- మాచర్ల, నరసరావుపేటలో బహిరంగ సభలు

నరసరావుపేట, మే 5: పల్నాడు జిల్లాలో తెలుగుదేశం ఎన్నికల ప్రచారం విస్తృతంగా జరుగుతోంది. పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 11న మాచర్ల, నరసరావుపేట నియోజకవర్గాలో ప్రజాగళం సభల్లో పాల్గొనను న్నారు. చంద్రబాబు పర్యటనకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. నరసరావుపేటలోని పల్నాడు రోడ్డులో సభ నిర్వహించాలని స్థానిక నేతలు నిర్ణయించారు. టీడీపీ- జనసేన- బీజేపీ నేతలు కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. కూటమి ముఖ్యనేతలు హాజరుకానున్నారు. ఎన్నికల ప్రచారం 11 సాయంత్రం 5 గంటలకు ముగించాల్సి ఉంది. నరసరావుపేట సభతో చంద్రబాబు ఎన్నికల ప్రచారాన్ని ముగించనున్నారు.

టీడీపీతోనే వడ్డెరలకు న్యాయం

- బీజేపీ జాతీయ కౌన్సిలింగ్ సభ్యుడు కృపారావు

దుర్గి, మే 5: టీడీపీతోనే వడ్డెరలకు న్యాయం జరుగుతుందని బీజేపీ జాతీయ కౌన్సిలింగ్ సభ్యుడు కృపారావు అన్నారు. మండల కేంద్రమైన దుర్గి జనసేన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల్లో 70 శాతం వడ్డెర కులస్తులేనని, వైసీపీ ప్రభుత్వంలో వడ్డెర కుటుంబాలు అస్తవ్యస్థ మయ్యాయన్నారు. జగన్ ఓ సారా వ్యాపారి అని, అధికారంలోకి రాగానే మద్యం, మట్టి, గ్రానైట్ వ్యాపారాలు తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో వెలిదండి శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, బండారు శ్రీనివాసరావు, కాట్రాజు నరసింహారావు, దేరంగుల శ్రీనివాసరావు, ఉప్పుతోళ్ల బాలాజీ, వేముల బ్రహ్మయ్య, సాంబశివరావు, గురువులు పాల్గొన్నారు.



ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న దూండి రాకేష్

ఆర్యవైశ్యుల ఓటు అడిగే హక్కు వైసీపీకి లేదు

- టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షులు దూండి రాకేష్

పిడుగురాళ్ల, మే 5: రాష్ట్రంలో ఆర్యవైశ్యుల ఓట్లు అడిగే హక్కు జగన్‌కు, వైసీపీ నేతలకు లేదని టీడీపీ రాష్ట్ర వాణిజ్యవిభాగం అధ్యక్షుడు దూండి రాకేష్ తెలిపారు. ఆదివారం రాత్రి పిడుగురాళ్లలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సతీమణి డాక్టర్ మేఘనలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సమావేశంలో దూండి రాకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో ఆర్యవైశ్యుల ఆస్తులను కబ్జా చేయడమే కాకుండా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా తీసుకోనటువంటి దౌర్భాగ్యస్థితి నియోజకవర్గంలో జరిగాయన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల ప్రాంతాలలో ఆర్యవైశ్యుల ఆస్తులను రక్షించుకోవడం, వారు పడ్డ శ్రమ అంతా ఇంతా కాదని, ఆస్తుల వద్ద బోర్డులు పెట్టి స్థలాలు కాపాడుకోవాల్సిన దుస్థితి కాసు మహేష్ రెడ్డి వలన కలిగిందన్నారు. గురజాలలో మీ అందరికీ అండగా వుంటూ, ఏ అవసరం వచ్చినా నేనున్నాననే భరోసా ఇచ్చే యరపతినేనిని, ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలుని అధిక మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు.

గుంటూరు మీదగా భువనేశ్వర్ - ఎల్‌టీటీ రైలు

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా భువనేశ్వర్ - ఎల్‌టీటీ ప్రత్యేక రైలుని గుంటూరు మీదగా నడిపేందుకు తూర్పు కోస్తా రైల్వే నిర్ణయించింది. నెంబరు. 08420 భువనేశ్వర్ - ఎల్‌టీటీ వేసవి ప్రత్యేక రైలు ఈ నెల 8వ తేదీ నుంచి జూన్ 26వ తేదీ వరకు ప్రతీ బుధవారం రాత్రి 11 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 1.55కి గుంటూరు, రాత్రి 7.20కి సికింద్రాబాద్, శుక్రవారం ఉదయం 10.30కి ఎల్‌టీటీ చేరుకొంటుంది. అలానే నెంబరు. 08419 ఎల్‌టీటీ - భువనేశ్వర్ వేసవి ప్రత్యేక రైలు ఈ నెల 10 నుంచి జూన్ 28వ తేదీ వరకు ప్రతీ శుక్రవారం మధ్యాహ్నం 1.20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.40కి గుంటూరు, ఆదివారం వేకువజామునకు ముందు 1.45కి భువనేశ్వర్ చేరుకొంటుంది.

గోల్కొండ, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్ల రద్దు

ఇన్‌ఫ్రాస్ట్రక్చరల్ మెయింటెనెన్స్ వర్కులు కారణంగా గుంటూరు - సికింద్రాబాద్, సికింద్రాబాద్ - గుంటూరు వయా కాజీపేట ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ని ఏప్రిల్ 29 నుంచి ఈ నెల 10వ తేదీ వరకు, తిరిగి 16 నుంచి 22వ తేదీ వరకు రద్దు చేసినట్లు డీఆర్‌ఎం ఎం రామకృష్ణ తెలిపారు. అలానే ఇరువైపులా గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ని కూడా ఏప్రిల్ 29 నుంచి ఈ నెల 10వ తేదీ వరకు, తిరిగి 16 నుంచి 22వ తేదీ వరకు రద్దు చేశామన్నారు. ఈ విషయాన్ని ప్రయాణీకులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.60
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	144, 153,164
చికెన్ విత్ స్కిన్	280.00
చికెన్ స్కిన్ లెస్	290.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



సమావేశంలో మాట్లాడుతున్న నసీర్, చిత్రంలో కాపు నాయకులు

ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థులను గెలిపిస్తాం

● కాపు నాయకుల ఆత్మీయ సమావేశంలో నాయకుల పిలుపు

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో ఎన్డీయే కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తామని కాపు నాయకులు తేల్చి చెప్పారు. పొన్నూరు రోడ్డులోని టీ కన్వెన్షన్ హాలులో ఆదివారం టీడీపీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎన్డీయే కూటమి నాయకులకు మద్దతుగా కాపు నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ సతీమణి రత్నశ్రీ, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి మహమ్మద్ నసీర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా డేగల ప్రభాకర్ మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గ అభివృద్ధిని వైసీపీ నాయకులు గాలికొదిలేశారన్నారు. కాపులను వైసీపీ కేవలం ఓటు బ్యాంకుగానే చూసారని విమర్శించారు. తెలుగుదేశం హయాంలో కాపులకు కల్పించిన అనేక సంక్షేమ పథకాలను వైసీపీ తుంగలోకి తొక్కిందన్నారు. కాపు భవనాలు, కాపు హాస్టళ్లు, విదేశీ విద్య మొదలగు వాటిని జగన్‌రెడ్డి నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని, అసెంబ్లీ అభ్యర్థి నసీర్‌లను గెలిపించి చట్టసభల్లోకి పంపించడమే కాపు నాయకుల లక్ష్యమని తెలిపారు. తూర్పు అభ్యర్థి నసీర్ మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కాపులకు అండగా ఉంటానని, కాపుల అభివృద్ధి కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వైసీపీ హయాంలో నిలిచిపోయిన కాపు భవనాలను పూర్తి చేస్తామని, కాపులకు పలు కార్పొరేషన్ పదవులు కేటాయించేలా పని చేస్తున్నానన్నారు. నామినేటెడ్ పదవుల్లో కాపులను కూర్చోబెడతామని హామీ ఇచ్చారు. కాపు హాస్టళ్లకు తాను వ్యక్తిగతంగా రూ.5 లక్షలను అందిస్తానన్నారు. పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని సతీమణి రత్నశ్రీ మాట్లాడుతూ పెమ్మసాని చంద్రశేఖర్ గెలుపునకు కాపులందరూ మద్దతుగా నిలవాలని కోరారు. సేవ చేయటానికే తాము రాజకీయాల్లోకి వచ్చామని, ఎలాంటి అవినీతి లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలను అందించడమే లక్ష్యమన్నారు. రానున్న రోజుల్లో కాపుల రిజర్వేషన్ పై చట్టసభల్లో పెమ్మసాని చంద్రశేఖర్ కృషి చేస్తారని ఆమె భరోసా ఇచ్చారు. కాపుల సత్తాతోనే ఎన్డీఏ కూటమి గెలుస్తుందని మాజీ మంత్రి శనక్కాయల అరుణ పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో ఎన్డీయే కూటమి బలపరచిన అభ్యర్థులను గెలిపించడమే లక్ష్యంగా ప్రతి కాపు సోదరులు పనిచేయాలని కోరారు. జనసేన నాయకురాలు కన్నా రజిని మాట్లాడుతూ ప్రభుత్వాలను గెలిపించాలన్న, దించాలన్న ఒక్క కాపులకు సాధ్యమన్నారు. కార్యక్రమంలో పెమ్మసాని రవి, తులసి యోగేష్, శనక్కాయల ఉమా శంకర్, ఉగ్గిరాల సీతారామయ్య, పోతురాజు సమత, పాకనాటి రమాదేవి, యర్రగోపు నాగేశ్వరరావు, ఆళ్ల హరి, మేకల బాబురావు, బొక్కిసం శివరామ్, మేకల రవీంద్ర, సౌరం రోహిత్, బొబ్బిలి రామారావు, తాడివాక సుబ్బారావు, ఐలా శ్రీను, బిట్రగుంట మల్లికా, అడపా మాణిక్యాలరావు, పోతురాజు వెంకట్, తోటా రామకృష్ణ, మిరియాల గోపి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల చైతన్య ఉద్యమంలో స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావాలి

● లెట్స్ ఓట్ ఆర్గనైజేషన్ జిల్లా కన్వీనర్ టి.బాలాజీ శ్రీనివాస్

గుంటూరు(విద్య), మే 5 : ఓటు నమోదు ప్రక్రియలో ప్రజలను జాగృతం చేసే విధంగా స్వచ్ఛంద సంస్థలు రోటరీ, లయన్స్ క్లబ్‌లు ముందుకు రావాలని లెట్స్ ఓట్ ఆర్గనైజేషన్ జిల్లా కన్వీనర్ టి.బాలాజీ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక బృందావన్ గార్డెన్స్ రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు కార్యాలయంలో ఓటింగ్ శాతం పెంపుదలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బాలాజీ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు అంటే ప్రజల చేత వారి సంక్షేమం, అవసరాల కోసం ఐదు సంవత్సరాలకు ఒకసారి తమ ప్రతినిధిగా తాత్కాలికంగా ఎన్నుకునే ప్రక్రియ మాత్రమే అన్నారు. తక్కువ ఓటు శాతంతో ఎన్నుకోబడే ప్రజాప్రతినిధి బాధ్యత రాహిత్యంగా మారే ప్రమాదం ఉన్నదన్నారు. అదే క్రమంలో 80 శాతం పైగా ఓటర్లు తమ ప్రతినిధిని ఎన్నుకోగలిగితే ఆ ప్రజా ప్రతినిధి జవాబుదారీతనంతో ప్రజల సంక్షేమం కోసం మాత్రమే చట్టాలు చేసి ప్రజల మేలు పొందుతాడని చెప్పారు. ఓటరు కొంత సమయాన్ని పోలింగ్ బూత్‌ల వద్ద కేటాయించటం బాధ్యతగా భావించాలన్నారు. జాతీయ ఎన్నికల కమిషన్ గుర్తింపు పొందిన లెట్స్ ఓట్ సంస్థ జాతీయ చైర్మన్ ప్రొఫెసర్ సుబ్బ రంగయ్య, రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కె.మాలకొండయ్య నేతృత్వంలో దేశవ్యాప్తంగా ఓటింగ్ శాతం పెరుగుదలకు అనేక కార్యక్రమాలు చేపట్టి అమలు చేస్తున్నదని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాలాజీ శ్రీనివాస్

గోమాంసం అక్రమ రవాణపై అధికారుల తీరు విచారకరం

● శైవ క్షేత్ర పీఠాధిపతి శివస్వామి

గుంటూరు(తూర్పు), మే 5: జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో గోమాంసం అక్రమ రవాణ జరుగుతుందని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవడంపై శైవ క్షేత్ర పీఠాధిపతి శివస్వామి విచారం వ్యక్తం చేశారు. బ్రాడీపేటలోని విశ్వ హిందు పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లే జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో దాదాపు 6 వేల కేజీల గోమాంసం తరలిస్తున్నారని రాతపూర్వకంగా జీఆర్‌పీఎఫ్, ఆర్‌పీఎఫ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ రవాణను అడ్డుకోకుండా పైగా గో రక్షకులపై అనుచితంగా ప్రవర్తించడం దారుణమన్నారు. తక్షణమే గో మాంస అక్రమ రవాణా, గో రక్షకులపై జరిగిన దాడులపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హిందు సంఘాల నాయకులు గోపికృష్ణ, హర్షవర్ధన్‌శాస్త్రి, అనిల్ బెహరా, సాయిశరత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివస్వామి, పాల్గొన్న భజరంగ్ దళ్ సభ్యులు

బొంగలరాలబీడు మహాప్రస్థానం అభివృద్ధికి విరాళం



కమిటీ సభ్యులకు చెక్కు అందజేస్తున్న మాలకొండయ్య

గుంటూరు(విద్య), మే 5 : స్థానిక బొంగరాలబీడులోని మహాప్రస్థానం అభివృద్ధి కొరకు ముళ్ళమూరి మాల కొండయ్య రూ.1,00,116 చెక్కును కమిటీ సభ్యులకు ఆదివారం అందజేశారు. ఇలాంటి వారిని ఆదర్శంగా తీసుకొని దాతలు ముందుకు రావాలని కమిటీ సభ్యుడు కల్లూరి రమణయ్య పిలుపునిచ్చారు. శ్మశాన వాటిక అభివృద్ధి కొరకు దాతలు ముందుకు రావాలని కమిటీ సభ్యులు కల్లూరు రమణయ్య, కూనల మాలకొండయ్య, ధనియాల గాంధీ, జంగాలపల్లి పార్థసారథి, నిమ్మగడ్డ అంకమ్మ చౌదరి విజ్ఞప్తి చేశారు.

జగన్ ప్రభుత్వం అవినీతిమయం

● టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం అవినీతిమయమని, వైసీపీ నాయకులు అవినీతిపరులుగా మారారని, చిలకలూరిపేట నుంచి వచ్చిన రజిని అక్రమ వసూళ్లలో రికార్డు సృష్టించగా, కిలారు రోశయ్య అక్రమ మైనింగ్‌తో వేల కోట్లు వెనకేసుకున్నారని గుంటూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ విమర్శించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని ఏ-1 కన్వెన్షన్ హాల్లో ఆదివారం జరిగిన బీసీ నాయకుల ఆత్మీయ సమావేశంలో పెమ్మసాని, పశ్చిమ అభ్యర్థి గల్లా మాధవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విడుదల రజనీకి ఏ అర్హత లేకపోయినా వైద్య శాఖ మంత్రిగా ఎలా నియమించారని నిలదీశారు. దళితులకు చెందిన 400 ఎకరాల భూములను ప్రభుత్వానికి అప్పగించడం వల్ల ఆమెకు మంత్రి పదవి వచ్చిందని ఆరోపించారు. అతి తక్కువ ఫీజులు తీసుకుంటూ వైద్యం అందించే డాక్టర్లను కూడా కొందరు అవినీతిపరులు వేధిస్తున్నారని, అదేమని అడిగితే ఫీజులు పెంచమని, పెంచిన ఫీజులను ప్రజలపై మోపమని సలహా ఇస్తున్నారని అన్నారు. వైసీపీ తరఫున ఎంపీగా పోటీ చేస్తున్న కిలారు రోశయ్య ప్రజలకు సంబంధించిన 700 ఎకరాల్లో అక్రమ గ్రావెల్ తవ్వి అవినీతి సంపాదనకు పాల్పడ్డారన్నారు. గడచిన ఐదేళ్లుగా ఆదాయాలు పెరగకపోయినా నిత్యవసరాలు, పెట్రోలు, ఇతర ధరలు మాత్రం ఆకాశాన్ని అంటాయన్నారు. మద్యం కాస్తా ప్రాణాంతకమైన రసాయనాలతో నిండిపోయి ప్రాణాలు తీస్తోందన్నారు. గల్లా మాధవి మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో ఈ జగన్ ప్రభుత్వం, ఆ పార్టీ నాయకులు భవన నిర్మాణ కార్మికుల పొట్టకొట్టారన్నారు. క్వారీలను అన్యాక్రాంతం చేస్తూ తమ పార్టీ నాయకులకు ప్రభుత్వం కట్టబెట్టిందన్నారు. వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి, వందల కోట్లను కేటాయించి టీడీపీ ప్రభుత్వం అభివృద్ధి చేసిందని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం కార్పొరేషన్‌కు నయా పైసా నిధులు ఇవ్వకుండా అవమానించిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ నేతలు మల్లె ఈశ్వరరావు, తన్నీరు ఆంజనేయులు, వడ్డే వెంకట్, చంద్రగిరి బాబు, జాన్ సైదా తదితరులు పాల్గొన్నారు.



బీసీల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న పెమ్మసాని

యాదవులకు అండగా తెలుగుదేశం పార్టీ : పెమ్మసాని

గుంటూరు, మే 5(ఆంధ్రజ్యోతి): యాదవ సోదరుల్లో ఎంతోమంది నాయకులను తయారుచేసిన ఘనత అన్న ఎన్టీఆర్, టీడీపీకే దక్కుతుందని పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరులోని స్థానిక ఏ కన్వెన్షన్ హాల్లో బీసీ సోదరుల ఆత్మీయ సమావేశం ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ సమావేశంలో పెమ్మసాని, గల్లా మాధవి, బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పెమ్మసాని మాట్లాడుతూ చంద్రబాబు ఎక్కడికి వెళ్లినా యనమల రామకృష్ణుడిని తన పక్కనే ఉంచుకోవడం యాదవులకు ఆయన ఇచ్చే గౌరవమన్నారు. కానీ జగన్ పక్కన పెట్టుకోవడం సంగతి దేవుడెరుగు, కనీసం యాదవులను గుర్తించే పరిస్థితి కూడా లేదన్నారు. గల్లా మాధవి మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకి మధ్య వారధి లాగా పని చేసేందుకు సంసిద్ధమై వస్తున్నాం. ప్రజలు ఎప్పుడూ గుర్తు పెట్టుకునేలా సేవలు చేయాలనేదే తమ ధ్యేయమని ఆమె అన్నారు. ప్రభుత్వం అందించే అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందించాలానే బలమైన నిర్ణయంతో వస్తున్నామని, మీరు అందించే సహాయ సహకారాలను దృష్టిలో ఉంచుకొని అందరి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ యాదవులు ఏదైనా మాట ఇవ్వడానికి ఆలోచిస్తారేమో గాని, మాట ఇస్తే మాత్రం ప్రాణం పోయినా కట్టుబడి ఉంటారన్నారు. ఒకసారి సర్దుకుపోయి పని చేయడం మొదలుపెడితే విజయ తీరాలకు చేరే వరకు కృషి చేస్తామన్నారు. ఎన్డీఏ కూటమి విజయానికి మా సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో తాళ్ల వెంకటేష్ యాదవ్, కుమ్మర క్రాంతి కుమార్, అడక శ్రీనివాసరావు, యాదవ నాయకులు తట్టుకోల కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదు

● పెమ్మసాని సతీమణి శ్రీరత్న

● బీసీల అణచివేతే లక్ష్యంగా జగన్ పాలన : మాధవి

● విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేస్తా : నసీర్



విశ్వబ్రాహ్మణ సమావేశంలో పెమ్మసాని శ్రీరత్న, గల్లా మాధవి

గుంటూరు, మే 5(ఆంధ్రజ్యోతి): బలహీన వర్గాల గురించి వైసీపీ నాయకులకు మాట్లాడే అర్హత లేదని, తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బడుగు, బలహీనవర్గాలకు అండగా నిలబడిందని గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ సతీమణి పెమ్మసాని శ్రీరత్న అన్నారు. టీడీపీ బీసీ విభాగం నేత గట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏ కన్వెన్షన్‌లో ఆదివారం విశ్వబ్రాహ్మణ సాధికార సభ్యుల సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా పెమ్మసాని శ్రీరత్న, గుంటూరు తూర్పు, పశ్చిమ ఉమ్మడి అభ్యర్థులు మొహమ్మద్ నసీర్, గల్లా మాధవి హాజరయ్యారు. ఈ సమావేశంలో శ్రీరత్న మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అంటేనే బీసీల పార్టీ అని, టీడీపీ హయాంలో లోటు బడ్జెట్లో కూడా బీసీల సంక్షేమానికి అధిక నిధులు ఖర్చు చేసిందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 13 జిల్లాలకు 8 మంది బీసీలను మంత్రులుగా చేసి బీసీల పక్షపాతిగా నిలిచిందన్నారు. బీసీల సామాజిక, రాజకీయ, ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తోంది ఒక్క తెలుగుదేశం మాత్రమేనని అన్నారు. విశ్వబ్రాహ్మణులను ఉన్నత స్థితికి తీసుకెళ్లడానికి టీడీపీ, పెమ్మసాని కృషి చేస్తారని తెలిపారు. నసీర్ మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులలో చాలా శిల్పులున్నారని, వారికి దేవాలయ నిర్మాణాలలో ప్రాధాన్యతను కల్పిస్తామన్నారు. వారిని గుర్తించి ప్రముఖ దేవాలయాలలో పూజారులుగా అవకాశం కల్పిస్తామన్నారు. వారికి చిన్న పరిశ్రమల ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. 50 సంవత్సరాలు పైబడిన బీసీలందరికీ పెన్షన్ సౌకర్యం కల్పిస్తామన్నారు. పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గల్లా మాధవి మాట్లాడుతూ బీసీల అణచివేతే లక్ష్యంగా జగన్‌రెడ్డి పాలన సాగుతుందన్నారు. దాడులు.. దౌర్జన్యాలు.. అక్రమ కేసులు తప్ప బీసీలకు ఒరిగిందేంటి అని నిలదీశారు. మూడున్నరేళ్లలో రూ.75 వేల కోట్ల బీసీ సబ్ ప్లాన్ నిధుల్ని దారి మళ్లించి బీసీ సాధికారితను మంటగలిపారన్నారు. ఆదరణ పథకాన్ని రద్దు చేసి పరికరాలు తుప్పు పట్టించారు. లబ్ధిదారుల 10 శాతం సొమ్ము స్వాహా చేశారన్నారు. బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీల బాంధవుడు మన చంద్రన్నే, బీసీ సంక్షేమం, అభివృద్ధి తెలుగుదేశంతోనే సాధ్యమన్నారు. బీసీలకు రక్షణ చట్టం తెస్తానని చంద్రబాబు బీసీలపై ఉన్న ప్రేమ చాటుకున్నారన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాడిశెట్టి మురళి, సింహాద్రి కనకాచారి, జంపని నాగేశ్వరరావు, పదిర ఈశ్వరచారి, పేగుడోలు లక్ష్మాచారి, పెద్ద సంఖ్యలో బీసీ నాయకులు పాల్గొన్నారు.

గౌడ కార్పొరేషన్‌కు ఒక్క రూపాయి ఇవ్వని వైసీపీ ప్రభుత్వం

● తూర్పు టీడీపీ అభ్యర్థి మొహమ్మద్ నసీర్



సమస్యలపై వినతిపత్రం ఇస్తున్న నేతలు

గుంటూరు, మే 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం గౌడ కార్పొరేషన్ పేరుతో ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా ఆర్థిక చైతన్యానికి దూరం చేసిందని గుంటూరు తూర్పు టీడీపీ అభ్యర్థి మొహమ్మద్ నసీర్ విమర్శించారు. పాతగుంటూరులోని గౌడ కల్యాణ మండపంలో పాత గుంటూరు గౌడ సంఘం ఆధ్వర్యంలో గౌడ కులం ఆత్మీయ సమ్మేళనం జరిగింది. సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా మొహమ్మద్ నసీర్, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ సతీమణి శ్రీరత్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ అమర్నాథ్ గౌడ్ అనే బాలుడిని అత్యంత కిరాతకంగా పెట్రోల్ పోసి దహనం చేసిన దుండగులని తూతూ మంత్రంగా కేసు పెట్టి వారిని యథేచ్ఛగా తిరిగే విధంగా వైసీపీ ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఆరోపించారు. అమర్నాథ్ కుటుంబ సభ్యులకి ఇల్లు కట్టిస్తామన్నారు కానీ, అది ఇంతవరకు ఎందుకు నెరవేరలేదో వైసీపీ నేతలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే గౌడ కులానికి తగిన సహాయసహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీల, మద్దిరాల మ్యాని, గాలి సతీష్ బాబు, గాలి నాగేశ్వరావురావు, బిచ్చల కృష్ణ, ఈతకుల శివనాగేశ్వరావు, పున్నయ్య, గోళ్ళ వెంకటేశ్వరావు, గోళ్ళ నాగరాజు, గోళ్ళ శివ, సిద్ధాయ, గాలి శ్రీను పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని పెమ్మసాని చంద్రశేఖర్, నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గం 12వ డివిజన్లో లాల్ తలబ్ మసీద్ వద్ద వైసీపీకి చెందిన 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి నసీర్ కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించారు. నసీర్ మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరూ రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. గత పదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం వల్ల జరిగిన అభివృద్ధి ఏమో గాని గుట్కా, గంజాయి ఏరులై పారిందన్నారు. వైసీపీ ఎమ్మెల్యే ముస్తఫా గుంటూరు తూర్పు ను గుట్కా, మత్తు పదార్థాలకు, గంజాయికి కేంద్రంగా మార్చేశారని ఆరోపించారు. నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే కచ్చితంగా చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నంబూరు సుభాని, డిప్యూటీ మేయర్ సజీల, కార్పొరేటర్ చిష్తి, మాజీ డిప్యూటీ మేయర్ గౌస్, భరత్‌రెడ్డి, సలీం, క్లస్టర్ హఫీజ్ పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో నసీర్, సజీల, టీడీపీ నేతలు

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఏడాదికి మహిళలకు రూ.లక్ష

● గుంటూరు తూర్పు కాంగ్రెస్ అభ్యర్థి మస్తాన్‌వలి

గుంటూరు, మే 5: వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు ఏడాదికి రూ.లక్ష చొప్పున బ్యాంకులో జమ చేసే పథకాన్ని కాంగ్రెస్ రూపొందించిందని మాజీ ఎమ్మెల్యే, గుంటూరు తూర్పు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి షేక్ మస్తాన్‌వలి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మస్తాన్‌వలి ఆ పార్టీ నాయకులతో కలిసి రెడ్డిపాలెం రోడ్డులోని రాజీవ్ గాంధీనగర్, శివనాగరాజు కాలనీ, వెంగళరావునగర్, సంజీవయ్యనగర్, వసంతరాయపురం, బొంగరాలబీడు ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కండేపల్లి రాము, కేసనపల్లి బుజ్జి, కావూరి నాగేశ్వరరావు, యోగేష్, స్రవంత్, కరీమ్, రెహమాన్, సాంబశివరావు తదితరులున్నారు.

పశ్చిమ నియోజకవర్గంలో జాన్‌బాబు ప్రచారం

పశ్చిమ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రాచకొండ జాన్ బాబు కొరిటెపాడు, నాయుడుపేట, అమరావతి రోడ్డు, ముత్యాల రెడ్డినగర్ ప్రాంతాల్లో ఆదివారం ఇంటింటికి పర్యటించి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోడేటి సందీప్, నాయకులు ఎల్.నితీష్, మట్టుపల్లి హరీష్, అంజిబాబు, జాఫర్ తదితరులున్నారు.

ఇండియా కూటమి గెలుపు కోసం ర్యాలీ

గుంటూరు(తూర్పు), మే 5 : ఇండియా కూటమి పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ విజయాన్ని కాంక్షిస్తూ నగరంలోని శంకర్‌విలాస్ నుంచి లాడ్జి సెంటర్, కొరిటెపాడు మీదుగా గుజ్జనగుండ్ల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వామపక్ష పార్టీల కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. అలాగే సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో 52 డివిజన్ పరిధిలో ఇండియా కూటమి విజయం సాధించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కోటా మాల్యాద్రి, దుర్గారావు, రావుల అంజిబాబు, చల్లా మరియదాసు, నూతలపాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇండియా కూటమి విజయానికి కృషి చేయాలి

ఇండియా కూటమి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భారత్ బచావో ప్రతినిధులు పిలుపునిచ్చారు. డాక్టర్ గోపీనాథ్, చిగురుపాటి భాస్కరరావు, గూడూరు సీతామాలక్ష్మి, కోలా నవజ్యోతిలతో కూడిన భారత్ బచావో ప్రతినిధులు గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాలలో పర్యటనలో భాగంగా స్థానిక మల్లయ్య లింగం భవన్లో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. కేంద్రం పోలవరానికి నిధులు సరిగా ఇవ్వలేదని, ప్రత్యేక రైల్వే జోన్‌ను గంగలో కలిపారని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను రక్షించగలిగిన ఒకే ఒక రాజకీయ శక్తి కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోని ఇండియా కూటమేనని స్పష్టం చేశారు. సమావేశంలో బత్తుల కోటేశ్వరరావు, సమతావేము, న్యాయవాది శిఖా సురేష్ పాల్గొన్నారు.

టీడీపీ కూటమి గెలుపు చారిత్రక అవసరం

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మురళి

● తాడిశెట్టి సమక్షంలో టీడీపీలోకి ప్రత్తిపాడు, పశ్చిమలోని వైసీపీ క్యాడర్

గుంటూరు, మే 5 : రాష్ట్రం అన్ని విధాలా వెనుకబడిన తరుణంలో ప్రస్తుతం టీడీపీ కూటమి గెలుపు చారిత్రక అవసరమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి, ప్రత్తిపాడు నియోజకవర్గ ఎన్నికల కో ఆర్డినేటర్ తాడిశెట్టి మురళి మోహన్ పిలుపునిచ్చారు. ప్రత్తిపాడు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గాల్లో పలువురు వైసీపీ శ్రేణులు తాడిశెట్టి సమక్షంలో టీడీపీలో చేరారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఆర్‌వీఆర్ కాలేజీ సమీపంలోని సిఆర్ నగర్‌కు చెందిన 70 కుటుంబాలు, వింజనంపాడు ఎస్సీ కాలనీ చెందిన 65 కుటుంబాలు, చల్లా అచ్చిరెడ్డి ఆధ్వర్యంలో నల్లపాడు గ్రామానికి చెందిన 50 వైసీపీ కుటుంబాలు కనపర్తి లలిత్ బాబు ఆధ్వర్యంలో బుడంపాడు ఎస్సీ కాలనీకి చెందిన 50 వైసీపీ కుటుంబాలు, 48వ డివిజన్ రెడ్డిపాలెం వైసీపీ నాయకురాలు దార్ల శిరీష తన అనుచరులతో పాటు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 28వ డివిజన్ సీతమ్మ కాలనికి చెందిన 50 కుటుంబాలు, ఓబీసీ జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వర ప్రసాద్ ఆధ్వర్యంలో వైసీపీ నేతలు, క్రియాశీల కార్యకర్తలు తాడిశెట్టి మురళి మోహన్ సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మురళి మోహన్ విలేకరులతో మాట్లాడుతూ రాజధాని నిర్మాణం జరగాలన్న, ప్రజలు ఆర్థిక పురోగతి సాధించాలన్నా, అన్ని వర్గాల ప్రజల జీవితాలు ఆనందాల హరివిల్లు కావాలన్నా టీడీపీ కూటమి అధికారంలోకి రావాలని మురళి మోహన్ సూచించారు. ఈ కార్యక్రమంలో తమ్మిశెట్టి శేషగిరిరావు, గోపి, రాంబాబు, ఒర్సు రామకోటి, రాజు, శివకోటి, చల్లా వెంకటేశ్వర్లు, తావత్ రమేష్, రవి, దనావత్ స్వామి, శ్రీను, శివా, రంగనాథ్, తారు నాయక్, రాజు, పల్లపు వెంకట్రావు, వేముల కృష్ణ, చల్లా వసంత రావు, కొండా, మల్లెల గురుమూర్తి, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, గురవయ్య, దిలీప్, గోపి, కుమార్, లక్ష్మయ్య, సురేష్, కిషోర్, ఆకాశ్, అనీల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తాడిశెట్టి మురళీమోహన్ తదితరులు

8 వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కుకు ఏర్పాట్లు

● కమిషనర్, ఆర్వో కీర్తి చేకూరి

గుంటూరు(కార్పొరేషన్), మే 5 : ఎన్నికల కమిషన్ నిర్దేశిత ప్రణాళిక ప్రకారం ఈ నెల 5 నుంచి 8 వరకు ఎన్నికల విధులు కేటాయించబడిన ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు గుంటూరు తూర్పు నియోజకవర్గానికి ఏసీ కాలేజిలో ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి తెలిపారు. స్థానిక ఏసీ కాలేజిలోని ఫెసిలిటేషన్ సెంటర్‌ని కేంద్ర ఎన్నికల సంఘం అబ్జర్వర్ ఎస్.పి.కార్తీక ఆదివారం తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరితో కలిసి పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్వో కీర్తి చేకూరి మాట్లాడుతూ, ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కుని వినియోగించుకోవడానికి అనువుగా ఏసీ కాలేజి ఫెసిలిటేషన్ సెంటర్‌లో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌కి దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు ముందుగా హెల్ప్ డెస్క్‌లో తమ ఓటు వివరాలు తెలుసుకొని, ఓటింగ్ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో ఓటు వినియోగించుకోవచ్చని తెలిపారు. ఓటర్లకు వీలుగా 6 కౌంటర్లు ఏర్పాటు చేశామని, వాటిలో 4 గుంటూరు తూర్పు నియోజకవర్గానికి, ఇతర జిల్లాల ఓటర్లకు రెండు కౌంటర్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని తెలిపారు. 5, 6 తేదీల్లో పీవో, ఏపీవోలు, మైక్రో అబ్జర్వర్‌లకు శిక్షణ జరుగుతుందని, శిక్షణ అనంతరం పోస్టల్ బ్యాలెట్‌కి ఏర్పాట్లు చేశామన్నారు. 7వ తేదీ ఓపీవోలు, 8వ తేదీ పోలీసులు, ఎన్నికల విధులు కేటాయించబడిన ఇతర సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్‌కి ఏర్పాట్లు చేశామని తెలిపారు. అలాగే ఎన్నికల విధుల్లో ఉండి ఫారం-12 దరఖాస్తు చేసుకోని ఉద్యోగులు ఈ నెల 7, 8 తేదీల్లో రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.



ప్రసంగిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

వైభవంగా ఆరాధన మహోత్సవాలు

గుంటూరు (తూర్పు), మే 5 : స్థానిక మారుతినగర్‌లోని శ్రీ కంచి కామకోటి పీఠ శ్రీ మారుతి దేవాల య ప్రాంగణంలో ప్రధాన అర్చకులు వంగర శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో మారుతీ సేవేంద్ర సరస్వతి స్వామి వారి ఆరాధన మహోత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారి మాన్యాస పూర్వక రుద్రాభిషేకం, యతీశ్వర ఆరాధన పూజ అనంతరం స్వామి వారికి భక్తిశ్రద్ధలతో తీర్థ రాజ కలశ స్థాపనతో పూజా కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం ప్రదోషకాల నందీశ్వర పూజా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పర్యవేక్షించారు.



పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్న అర్చకులు

హైకోర్టు జడ్జిని మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్, ఎస్పీ

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జీ.నరేందర్‌ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారధి, కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ తుషార్ డూడీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం ఆయన జిల్లా కోర్టులో న్యాయమూర్తులకు ఏర్పాటు చేసిన సదస్సులో పాల్గొనేందుకు వచ్చారు. రైల్వే అతిథి గృహంలో జిల్లా జడ్జి, కలెక్టర్, ఎస్పీలు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జీ.నరేందర్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా జడ్జి, కలెక్టర్, ఎస్పీ

జన కేతనం
ఆంధ్రజ్యోతి
6
గుంటూరు జిల్లా వార్తలు
సోమవారం 6 మే 2024


యర్రబాలెంలో అమరావతి రైతులతో మాట్లాడుతున్న నారా బ్రాహ్మణి

బై.. బై.. బలసాని

- ప్రత్తిపాడులో ఖాళీ అవుతున్న వైసీపీ
- తెలుగుదేశం పార్టీకి పెరుగుతున్న ఆదరణ
- వేల సంఖ్యలో పార్టీలో చేరుతున్న వైసీపీ కార్యకర్తలు
- వైసీపీకి దూరంగా మరి కొంతమంది పార్టీ కార్యకర్తలు



ప్రత్తిపాడు, మే 5: ప్రత్తిపాడులో అధికార వైసీపీకి గడ్డు పరిస్థితి ఏర్పడింది. ఆ పార్టీ అధినేత జగన్ చేసిన ప్రయోగం ఇక్కడ బెడిసి కొట్టింది. ఆ పార్టీకి గుండె కాయగా ఉన్న కొన్ని సామాజిక వర్గాలు పార్టీకి దూరం అయ్యే పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు ఇప్పటికే ఏర్పడ్డ గ్రూపు విబేధాలు.. వాటిని సరిచేయలేని అసమర్ధ స్థితిలో పార్టీ నాయకత్వం ఉండటంతో ఆ పార్టీ అభ్యర్థి బలసాని కిరణ్ కుమార్ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఇప్పటికే గ్రామాల్లో వర్గాల కారణంగా ప్రధాన క్యాడర్ మొత్తం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తోంది. ఈ పరిస్థితుల్లో అంపశయ్యపై ఉన్న వైసీపీ నాయకులకు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చంద్రబాబు ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టో దెబ్బకు దిమ్మ తిరిగింది. ఇప్పటికే నియోజకవర్గంలో తెలుగుదేశం పవనాలు ఎక్కువగా వీస్తుండటం.. ఈ సమయంలో పార్టీ మారితేనే రేపు అధికారంలోకి వచ్చిన తరువాత తమకు గుర్తింపు ఉంటుందనే ఉద్దేశ్యంతో తెలుగుదేశం పార్టీలోనికి వలసలు పెను తుఫానుగా మారింది. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి వేలసంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు రామాంజనేయులు సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకుంటున్నారు.

మౌనముద్రలో ప్రధాన వర్గం నాయకులు

వైసీపీకి గుండె అంటూ చెప్పుకునే ప్రధాన వర్గం ఇప్పుడు బలసాని కిరణ్ కుమార్‌కు దూరంగా ఉంటుంది. ఇప్పటివరకు నాయకులుగా ఉన్న వారు మేము ఓటర్లం మాత్రమే అని చెప్పుకుంటూ తిరుగుతున్నారు. మాలలు ఎక్కువగా ఉన్న ప్రత్తిపాడుకు మాదిగ సామాజిక వర్గానికి చెందిన బలసాని కిరణ్‌కుమార్‌ను నియమించారు. తొలిసారి ఇక్కడ వైసీపీ నుంచి మాదిగకు సీటు కేటాయించడంతో మాల సామాజిక వర్గం మొత్తం తొలి నుంచి దూరంగానే ఉంటూ వస్తుంది. ఈ క్రమంలోనే ఆయనకు వ్యతిరేకంగా రెండుసార్లు సమావేశాలు కూడా ఏర్పాటు చేశారు. క్రియాశీలకంగా వ్యవహరించే నాయకులు ప్రస్తుతం దూరంగా ఉంటూ వస్తున్నారు. అంతేకాకుండా అన్ని వర్గాలకు చెందిన క్యాడర్ సైతం ఎన్నికలు అన్న ఊసే లేకుండా, తమకేమీ పట్టనట్టు తాపీగా తిరుగుతూ కాలక్షేపం చేస్తున్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న పరిస్థితులను అర్థం చేసుకుంటున్న ద్వితీయ శ్రేణి నాయకులు కార్యకర్తలు ఏ మాత్రం ఆలోచించకుండా తెలుగుదేశం పార్టీ గూటికి చేరుతున్నారు. గత నెల రోజులుగా ప్రతి రోజు పార్టీ లోకి చేరికలు జరుగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో తెలుగుదేశం పార్టీ అనూహ్యంగా పుంజుకుంది. ఓ పక్క మేనిఫెస్టో, మరో పక్క రామాంజనేయులు ప్రజలకు దగ్గరవుతున్న తీరు ఆ పార్టీని విజయం వైపు నడిపిస్తుంది.



అమరావతికి
ఇక మంచి రోజులు

- అమిత్‌షా కూడ చెప్పారు కదా!
- చేనేత వస్త్రాలపై జీఎస్టీ ఎత్తివేస్తాం
- లోకేశ్‌కు మంచి మెజారిటీని ఇవ్వండి
- మంగళగిరి ప్రచారంలో బ్రాహ్మణి

మంగళగిరి, మే 5: రాష్ట్రానికి మంచిరోజులు రాబోతున్నాయి.. ముఖ్యంగా రాజధాని అమరావతికి మంచి భవిష్యత్తు రాబోతుంది. ఆదివారం నాటి రాష్ట్ర ఎన్నికల ప్రచారం సందర్భంగా... కేంద్ర మంత్రి అమిత్‌షా కూడా ఏపికి అమరావతే రాజధానిగా వుండబోతుందని స్పష్టంగా చెప్పినందున అమరావతి రైతులందరూ ధైర్యంగా వుండాలని మంగళగిరి టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ సతీమణి బ్రాహ్మణి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రాత్రి ఆమె ఎర్రబాలెంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆ గ్రామ రైతులు గత అయిదేళ్లగా తాము పడిన కష్టాల గురించి బ్రాహ్మణికి వివరించగా ఆమె పైవిధంగా స్పందించారు. ఎర్రబాలెం రామాలయం సెంటరులో జరిగిన సమావేశంలో రైతులు... గత ఐదేళ్లపాటు ప్రభుత్వం తమకు కౌలు డబ్బును సక్రమంగా వేయకుండా ఆర్ధిక ఇబ్బందులకు గురిచేసిందని, టీడీపీ అధికారంలోకి వచ్చాక కౌలు డబ్బును సక్రమంగా చెల్లించడంతోపాటుగా పదేళ్లపాటు కౌలు చెల్లింపు నిబంధనను సవరించి అదనంగా మరో అయిదేళ్లపాటు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశమై బ్రాహ్మణి స్పందిస్తూ రైతులు అడిగిన దాంట్లో న్యాయముందని.. ఈ విషయాన్ని చంద్రబాబు దృష్టికి తీసుకువెడతానని సమాధానమిచ్చారు.

తొలుత గ్రామంలోని శ్రీ భావనారుషిస్వామి దేవస్థానం వద్ద పద్మశాలీయులు ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేనేత వస్త్రాల అమ్మకాలను ప్రోత్సహించేందుకు జీఎస్టీని ఎత్తివేయాలన్న వినతులు ఎక్కువగా వస్తున్నాయని... చేనేతల సంక్షేమం కోసం జీఎస్టీని ఎత్తివేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చేనేత కార్మికుల డిమాండ్ మేరకు రాష్ట్రంలో తిరిగి జనతా వస్త్రాల పథకాన్ని పునరుద్ధరించాలని తాను చంద్రబాబుకు సిఫారసు చేస్తానన్నారు. అలాగే 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను చేనేతలకు అందిస్తామన్నారు. మంగళగిరి చేనేతవస్త్రాలకు అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపును తీసుకురావడంతోపాటు వాటికి మంచి గిరాకీని తెచ్చేలా లోకేశ్ ఇప్పటికే చర్యలను చేపట్టారని ఆమె గుర్తుచేశారు. మంగళగిరిలో శ్రీ లక్ష్మీ నరసింహా స్వర్ణకారసంక్షేమ సంఘాన్ని లోకేశ్ పట్టుదలతోనే మంగళగిరిలో ఏర్పాటుచేశారని చెప్పారు. స్వర్ణకారుల సంక్షేమం కోసం రాబోయే రోజుల్లో మంగళగిరిని దేశంలోనే అతిపెద్ద గోల్డ్‌హబ్‌గా లోకేశ్ తీర్చిదిద్దబోతున్నారని అన్నారు. మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు లోకేశ్ ఏవైతే హామీలను ఇచ్చారో వాటన్నింటిని తుచ తప్పకుండా అమలుచేసి దేశంలోనే మంగళగిరిని ఓ మోడల్ నియోజకవర్గంగా అగ్రస్థానంలో నిలబెడతారన్నారు.


భోగి ఎస్టేట్స్‌లోని లోకేశ్ క్రీడాప్రాంగణంలో క్రికెట్ ఆడుతున్న నారా బ్రాహ్మణి

తొలుత నారా బ్రాహ్మణి మంగళగిరి బైపాస్ రోడ్డు వెంబడి వున్న బోగి ఎస్టేట్స్‌ని నారా లోకేశ్ క్రీడా ప్రాంగణాన్ని సందర్శించి అక్కడి క్రీడాకారులు, వాకర్స్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె కొద్దిసేపు వాలీబాల్ ఆడారు. ఆ తరువాత క్రికెట్ పిచ్‌పై బ్యాటింగ్ చేసి కార్యకర్తలను, అభిమానులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా అక్కడ హాజరైన క్రీడాకారులతో ముచ్చటిస్తూ బాలలు, యువత డ్రగ్స్ వంటి వ్యసనాల బారినపడి జీవితాలను నాశనం చేసుకోరాదన్నారు. వ్యసనాలనుంచి బాలలను దూరం చేసేందుకే లోకేశ్ మంగళగిరి, తాడేపల్లిలో లోకేశ్ క్రీడాప్రాంగణాలను ఏర్పాటుచేశారన్నారు. అనంతరం ఎన్నారై ఆసుపత్రి వెనుకవైపున్న ఎస్ఆర్ పారడైజ్ అపార్టుమెంట్ వాసులతో సమావేశమాయ్యరు. ఆ తరువాత స్థానిక కుప్పురావు కాలనీలోని శ్రీసీతారాముల ఆలయం వద్ద నవమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు వడ్డించారు. కార్యక్రమాలలో టీడీపీ నేతలు నందం అబద్దయ్య దామర్ల రాజు, సంకా బాలాజీగుప్తా, ఆకుల జయసత్య, తమ్మిశెట్టి జానకీదేవి, యలమంచిలి పద్మజ, మంచికలపూడి వైష్ణవి, ఆకుల ఉమామహేశ్వరరావు, మంద్రు రాము, గోవాడ దుర్గారావు, షేక్ రియాజ్, గోసాల రాఘవ, కనికళ్ల చిరంజీవి, పడవల మహేష్, బట్టు చిదానందశాస్త్రి, బిట్రా దుర్గారావు, బట్టు మోహన్, జొన్నాదుల బాలకృష్ణ, అలుగూరి రాజశేఖర్, చావలి ఉల్లయ్య పాల్గొన్నారు.

అమరావతి రైతులకు..
అండగా..

- నాల్గోసారి పోటీలో తెనాలి శ్రావణ్‌కుమార్
- వైసీపీని వీడి టీడీపీలోకి భారీగా చేరికలు
- ఉత్సాహంగా పనిచేస్తున్న టీడీపీ శ్రేణులు



తాడికొండ, మే 5: తాడికొండ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా నాలుగోసారి బరిలోకి తెనాలి శ్రావణ్‌కుమార్ దిగుతున్నారు. వైసీపీ నుంచి మాజీమంత్రి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. తెనాలి శ్రావణ్‌కుమార్ 2009లో ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి టీడీపీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా తాడికొండలో బరిలోకి దిగారు. 2009లో మొదటిసారి ఓడిపోయినా నియోజకవర్గాన్ని అంటిపెట్టుకొని, కార్యకర్తలు, నాయకులకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గంలో పట్టు పెంచుకొని 2014లో జరిగిన ఎన్నికల్లో గెలిచి ఎమ్మెల్యే అయ్యారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా ఉన్న సుచరిత హోంమంత్రిగా పనిచేశారు. ప్రత్తిపాడులో తీవ్ర వ్యతిరేకత రావటంతో వైసీపీ అధిష్టానం తాడికొండకు బదిలీ చేశారు. శ్రావణ్‌కుమార్‌ను తన కుటుంబలో ఒకడిగా నియోజకవర్గంలోని ప్రజలు భావిస్తున్నారు. ప్రచారంలో అడుగడుగూ ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. నియోజకవర్గంలోని ఫిరంగిపురం మండలంలో టీడీపీకి పట్టు తక్కువుగా ఉండటంతో ఆ ప్రాంతంపై దృష్టిపెట్టి ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. దీంతో ఆ మండలంలోని వైసీపీ నుంచి నాయకులు, కార్యకర్తలను టీడీపీలోకి తీసుకురాటానికి ఎంతో గ్రౌండ్‌వర్క్ చేసి వైసీపీ మెజార్టీని తగ్గించటానికి ముమ్మరంగా ప్రయత్నం చేయటంలో సఫలీకృతం అయ్యారు. అంతేకాకుండా నియోజకవర్గంలోని వైసీపీలో క్రియాశీలంగా పనిచేస్తున్న వారిని టీడీపీలోకి తీసుకువచ్చారు.

నియోజకవర్గంలోని ప్రధాన పార్టీలు, స్వతంత్ర్య అభ్యర్థులు కలిపి 10మంది పోటీలో ఉన్నారు. కాని ప్రధానంగా టీడీపీ, వైసీపీ మధ్యే ద్విముఖ పోటీ ఉంది. ఎస్సీ నియోజకవర్గం కావటంతో ఎస్సీలు ఎక్కువగా ఉన్న గ్రామాలపై అభ్యర్థులు దృష్టి పెడుతున్నారు. అలాగే ముస్లింలు, కమ్మ, బీసీలు కూడా ఈ నియోజకవర్గంలో ఓటర్లు అధికంగా ఉన్నారు. వైసీపీ అభ్యర్థి కుటుంబసభ్యులు పెత్తనం చేస్తున్నారనే అపవాదు మూటగట్టుకున్నారు. దీంతో కార్యకర్తలు, నాయకులు కొంత అసహనానికి గురౌతున్నారు. గ్రామాల్లో బలాబలాలను టీడీపీ, వైసీపీ పార్టీలు లెక్కలు వేసుకుంటున్నారు. రాజధాని నియోజకవర్గంగా ఉన్న తాడికొండలో టీడీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, భవనాల నిర్మాణం, రాజధానిలో భూములు లేనివారికి రూ.2,500 పింఛన్లు, రాజధాని నిర్మాణం, ప్రజలకు అందుబాటులో సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు, ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం, ఫిరంగిపురాన్ని టూరిజం స్థలంగా మార్చటానికి ప్రభుత్వ నిధులు మంజూరు చేసింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మూడు రాజధానుల ప్రకటన చేయటంతో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర నిరసనలు వ్యక్తం అయ్యాయి. రాజధాని గ్రామాల్లోని రైతులు, మహిళలు, రైతుకూలీలు ఉద్యమాలు చేస్తున్నారు. దీంతో టీడీపీ అభ్యర్థికే ఓటు వేస్తారని అపార్టీ నాయకులు అంచనా వేస్తున్నారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు శ్రావణ్‌కుమార్‌కు నియోజకవర్గంలోని ప్రజలకు అడిగిన వారికి అడిగినట్లు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించారని, ఎలాంటి అవినీతి ఆరోపణలు లేని వ్యక్తిగా పేరు ఉంది. ఇవే శ్రావణ్‌ను గెలుపు దిశగా అడుగులు పడుతాయని ప్రజలు అంటున్నారు.

పే.. ప్రలోభాలు

- రూటు మార్చి డిజిటల్ ప్రలోభాలు
- డిజిటల్ లావాదేవీలపై కొరవడిన నిఘా
- బ్యాంకులు, యూపీఐ ప్లాట్‌ఫామ్స్ ద్వారా నగదు బదిలీలు
- బ్యాంకు వర్గాలకు, ఎక్స్‌పెండీచర్ టీంకు కొరవడిన సమన్వయం
- ఒకే ఖాతా నుంచి పదుల సంఖ్యలో ట్రాన్సాక్షన్స్ జరుగుతున్నా మౌనమే



బాపట్ల, మే 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ఓ వైసీపీ నేత బ్యాంకు ఖాతా నుంచి కొన్ని రోజులుగా లక్షల్లో లావాదేవీలు జరిగాయి. గూగుల్‌పే, ఫోన్‌పే వంటి యూపీఐ లావాదేవీల ద్వారా చిన్న మొత్తాలు పదుల సంఖ్యలో ట్రాన్సఫర్ జరుగుతున్నాయి. ఓ వైసీపీ ద్వితీయశ్రేణి నేత ఖాతా నుంచి మూడు వేల నుంచి ఐదు వేల వరకు నగదు పదుల సంఖ్యలో వ్యక్తులకు యూపీఐ ట్రాన్సాక్షన్స్ జరిగాయి. రోజూ ఇలాంటి లావాదేవీలు జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో జరుగుతున్నాయి. అవేవీ అధికారులకు అనుమానాస్పదంగా కనిపించడంలేదు. పైగా వాటిపై కనీస దృష్టి కూడా సారించక పోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిఘా పెంచడంతో అభ్యర్థులు రూటుమార్చి డిజిటల్ లావాదేవీల ద్వారా ప్రలోభాలపై దృష్టిపెట్టారు.

రోజు వారీ లావాదేవీల జాబితా..

బ్యాంకు ఖాతాల ద్వారా పది లక్షల నుంచి 50 లక్షల వరకు జరుగుతున్న లావాదేవీల జాబితాను అటు ఎక్స్‌పెండీచర్ టీంకు అందించడంతో పాటు ఐటీ విభాగానికి బ్యాంకర్లు నిత్యం చేరవేయాలి. అయితే వీటిలో అనుమానాస్పద లావాదేవీలేవీలపై కసరత్తు లేదు. బ్యాంకులు రోజువారీ అందిస్తున్న జాబితా ప్రకారం జిల్లావ్యాప్తంగా ప్రతి రోజు పది లక్షలకు మించి లావాదేవీలు జరుగుతున్న ఖాతాలు 40 దాకా ఉన్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే ఈ సంఖ్య దాదాపు వందల్లో ఉండొచ్చనేది సమాచారం. యూపీఐ ట్రాన్సాక్షన్స్‌ను రాజకీయపార్టీలు వాడుకుంటున్నాయి. చిన్న మొత్తాలపై ఎటువంటి నిఘా లేకపోవడం వారికి కలిసొచ్చింది. ద్వితీయ శ్రేణి నేతకు పెద్ద మొత్తంలో నగదును బ్యాంకు ఖాతాల్లో జమ చేసి, మూడు వేల నుంచి ఐదు వేలను సదరు నేత ఖాతా నుంచి రోజుకు వందల సంఖ్యలో కావాల్సిన ఓటర్లకు చేరవేస్తున్నారు. ఈ లావాదేవీలేవీలపై ట్రాకింగ్ లేకపోవడంతో పాటు వీటిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై ఈసీ నుంచి కూడా స్పష్టమైన ఆదేశాలు లేకపోవడంతో ఓటర్లను ప్రలోభపెట్టడానికి ఈ మార్గాన్ని నేతలు ఎంచుకుంటున్నారు.



పోరాట పటిమ

- తూర్పులో గెలుపు కోసం టీడీపీ అభ్యర్థి నసీర్ అహ్మద్ అడుగులు
- 2 దశాబ్ధాల తర్వాత సైకిల్ స్వారీ చేసే దిశగా ఎన్నికల వాతావరణం


నసీర్ అహ్మద్

గుంటూరు, మే 5(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు భారీ మెజార్టీలు అందించిన నియోజకవర్గమిది. ఎన్‌టీఆర్ ప్రభంజనంలో బుడేఖాన్, చంద్రబాబు హయాంలో ఎస్ఎం జియావుద్దీన్ మంచి మెజార్టీలతో గెలుపొంది శాసనసభలో అడుగు పెట్టారు. ఏ కారణం చేతనో 2004 మొదలుకొని 2019 వరకు జరిగిన నాలుగు సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గెలవలేకపోయింది. ఒకానొక సందర్భంలో మూడో స్థానానికి కూడా పడిపోయింది. అలాంటి పరిస్థితిలో గత ఎన్నికల్లో ఓటమి పాలైనా ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా ప్రతీ డివిజన్‌లో పార్టీ క్యాడర్‌కు అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యలపై అనునిత్యం పోరాడుతూ ప్రజల మద్దతు కూడగట్టుకొన్నారు. ఈ దఫా ఎలాగైనా గెలిచి నియోజకవర్గంలో పార్టీ జెండా ఎగురవేయాలని అడుగులు వేస్తోన్న ఆ నాయకుడే గుంటూరు తూర్పు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి నసీర్ అహ్మద్.

నసీర్ అహ్మద్ సాధారణ కార్యకర్త స్థాయి నుంచి ఎదుగుతూ శాసనసభకు పోటీ చేసే స్థాయికి వచ్చారు. కాంగ్రెస్ పార్టీలో రాజకీయ ప్రస్థానం ప్రారంభించి ఆ తర్వాత వైసీపీలో చేరారు. 2014లో ఆ పార్టీ తరుపున సీటు ఆశించినప్పటికీ సాధించుకోలేకపోయారు. 2019 ఎన్నికలకు ముందు వైసీపీని వీడి అనూహ్యంగా టీడీపీ టిక్కెట్ సాధించుకొన్నారు. అప్పట్లో నిన్ను నమ్మం... ముస్తఫా అంటూ ఆయన అప్పటి వైసీపీ ఎమ్మెల్యే ముస్తఫా మీద చేసిన ప్రచారానికి మంచి క్రేజ్ వచ్చింది. ఎన్నికలకు కొద్ది రోజుల ముందు టిక్కెట్ రావడంతో ఆయన సరిగా ప్రచారం చేసుకోలేకపోయారు. అలానే ఆ ఎన్నికల్లో వైసీపీ గాలి బలంగా వీచడంతో ఓటమి పాలయ్యారు. అయితే అక్కడి నుంచే ఇటుక ఇటుక పేరుస్తూ టీడీపీని బలోపేతం చేయడం ప్రారంభించారు.

కరోన సమయంలో క్యాడర్ సహకారంతో నసీర్ అహ్మద్ పెద్దఎత్తున సహాయక కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే ముస్తఫాతో సహా ఆయన బంధువులు చేపట్టిన ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు అడుగడుగునా అడ్డు తగిలారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం చేయనీయకుండా అడ్డుకొన్నారు. గత మునిసిపల్ ఎన్నికల్లోనే తూర్పులో కొంతమంది టీడీపీ అభ్యర్థులను కార్పొరేటర్లుగా గెలిపించుకొన్నారు. ముఖ్యంగా కొత్తపేటలో జరిగిన ఉప ఎన్నికల్లో వైసీపీకి గట్టి షాక్ ఇచ్చారు. మునిసిపల్ ఎన్నికల్లో అక్కడ వైసీపీ అభ్యర్థి పాదర్తి రమేష్‌గాంధీ గెలుపొందగా ఆయన మరణానంతరం జరిగిన ఉప ఎన్నికలో టీడీపీ అభ్యర్థి పోతురాజు సమత గెలుపొందేలా నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా అహర్నిశలు శ్రమించారు. అప్పుడే ఆయన శక్తిసామర్థ్యాలు నిరూపితమయ్యాయి. ఇటీవల కలుషిత నీరు సేవించి పలువురు చనిపోయినప్పుడు అందరికంటే ముందు నసీర్ అహ్మద్ గళం విప్పారు. బాధితుల పక్షాన నిలిచి పోరాడారు. దాంతో ప్రభుత్వం దిగి వచ్చి నష్టపరిహారం అందజేసింది. వైసీపీ కార్పొరేటర్ల అరాచకాలను, ఆర్యవైశ్య సామాజిక వర్గీయుల ఆస్తి కొట్టేసేందుకు చేసిన ప్రయత్నాలను అడ్డుకొన్నారు. పోలీసులు ఇబ్బంది పెట్టినా ఏమాత్రం వెనకడుగు వేయలేదు. ఈ విధంగా పోరాటమే ప్రధాన అస్త్రంగా ఆయన మలుచుకొని ముందుకుసాగారు. దీంతో మరో ఆలోచన చేయకుండా నసీర్ అహ్మద్‌కు చంద్రబాబు గుంటూరు తూర్పు టిక్కెట్‌ని ఖరారు చేశారు. అంతకముందు నుంచే తూర్పులోని అన్ని డివిజన్లలో పర్యటిస్తూ ప్రజల మద్దతు కూడగట్టుకొంటున్నారు. తద్వారా తూర్పులో టీడీపీకి అనుకూల వాతావరణాన్ని తీసుకొచ్చారు.

ఇంకా ఫారం-12 ఇవ్వని వారికి మరో అవకాశం

- 7, 8 తేదీల్లో వారి ఓటు ఎక్కడుంటే అక్కడికే వెళ్లి ఇవ్వాలి
- అక్కడే వాళ్లకి పోస్టల్ బ్యాలెట్ ఇచ్చి ఓటు వేసే అవకాశం కల్పిస్తారు
- మీడియా సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి వేణుగోపాల్‌రెడ్డి


సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

గుంటూరు, మే 5(ఆంధ్రజ్యోతి): పోలింగ్ రోజున విధుల్లో ఉండే ఉద్యోగుల్లో ఎవరైతే ఇంకా ఫారం-12 ఇవ్వలేదో వారికి ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. ఈ నెల 7, 8 తేదీల్లో వారి ఓటు ఎక్కడైతే ఉందో ఆ నియోజకవర్గానికి వెళ్లి అక్కడి ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఫారం-12 ఇస్తే సంబంధిత ఆర్‌వో వెంటనే వారికి పోస్టల్ బ్యాలెట్ ఇస్తారని జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. ఆదివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీడియా సెంటర్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన జిల్లా ఎస్పీ తుషార్ డూడీతో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులు సంబంధిత నియోజకవర్గానికి వెళ్లి ఓటేసేందుకు ఒక రోజు స్పెషల్ క్యాజువల్ లీవ్‌ని కూడా ఈసీ మంజూరు చేసిందని చెప్పారు. దీని దృష్ట్యా ఇంకా ఫారం-12 పొందని వారు ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని, మంగళ, బుధవారంలలో ఏ రోజు వీలైతే ఆ రోజు ఓటు ఉన్న నియోజకవర్గంలోని ఫెసిలిటేషన్ సెంటర్‌కు వెళ్లాలని సూచించారు.

పీవోలు, ఏపీవో, మైక్రో అబ్జర్వర్‌లకు ఆది, సోమవారంలలో నియోజకవర్గం కేంద్రాల్లో రెండో దశ శిక్షణ ఏర్పాటు చేశామని, ట్రైనింగ్ ముగియగానే సాయంత్రం 4 గంటల నుంచి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు అవకాశం కల్పించామన్నారు. ఓపీవోలు ఒక్కో నియోజకవర్గంలో వెయ్యి మంది వరకు ఉంటారని, దీని దృష్ట్యా వారికి ఈ నెల 7వ తేదీన ఉదయం 8 గంటల నుంచి ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నామన్నారు. 8వ తేదీన పోలీసులు, ఇతర అత్యవసర సేవల్లో ఉండే వారికి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కల్పిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో మొత్తం 21,778 మంది ఉద్యోగులు, ఇతర అత్యవసర సేవల్లో ఉన్న వారు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోబోతున్నారని తెలిపారు. ఇతర జిల్లాల్లో విధులు నిర్వహిస్తూ ఇక్కడ ఓటు ఉన్న 5,688 మంది ఉద్యోగులకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్‌లు ఆయా జిల్లాలకు పంపించామన్నారు. అలానే వేరే జిల్లాల్లో ఓటు ఉండి ఇక్కడ విధులు నిర్వహిస్తున్న 5,092 మందికి సంబంధించి ఆయా జిల్లాల నుంచి పోస్టల్ బ్యాలెట్‌లు తెప్పించామన్నారు. ఓటింగ్ అనంతరం సీలు బాక్సులను ఈ నెల 10వ తేదీన సీఈవో కార్యాలయానికి తీసుకెళ్లి అక్కడ ఏజంట్ల సమక్షంలో తెరిచి ఏ జిల్లా ఓట్లను ఆ జిల్లాకు వేరు చేసి పంపించడం జరుగుతుందన్నారు.

9.50 లక్షల ఓటర్ స్లిప్పుల పంపిణీ

జిల్లాలో 17 లక్షల పైచిలుకు ఓటర్లు ఉండగా వారిలో ఇప్పటికే 9.50 లక్షల మంది ఓటర్ స్లిప్పులను పంపిణీ చేశామని కలెక్టర్ తెలిపారు. మిగతా వారికి సోమ, మంగళవారంలలో పంపిణీ చేస్తామన్నారు. అలానే కొత్తగా వచ్చిన 3.50 లక్షల ఎపిక్ కార్డులలో కేవలం 9,032 మాత్రమే పంపిణీ చేయాల్సి ఉన్నదని, అవి కూడా తపాల శాఖకు అందజేయడం జరిగిందన్నారు. హోం ఓటింగ్‌కు సంబంధించి 2,348 ఎంచుకోగా వారిలో 1,928 మంది ఇప్పటికే ఓటు వేశారని తెలిపారు. ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియని పూర్తి చేశామని, 12వ తేదీన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు సిబ్బంది ఉదయం 7 గంటలకు వచ్చి మధ్యాహ్నం 12 గంటల లోపు మెటీరియల్ తీసుకొని సంబంధిత పోలింగ్ కేంద్రాలకు వెళ్లిపోవాలన్నారు.

జిల్లా ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ పోలీసులకు వీడియోగ్రఫీతో సహా బాడీ ఓన్ కెమెరాలు ఇచ్చామన్నారు. నేరచరిత్ర కలిగిన వారందరిని బైండోవర్ చేశామన్నారు. నిస్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎలాంటి సమస్య ఎదురైనా సమర్థతంగా ఎదుర్కొనేందుకు అందరిని సంసిద్ధం చేయడం జరిగిందన్నారు.

గుంటూరు రూరల్ వార్తలు

మంగళగిరి తాడికొండ ప్రత్తిపాడు

పీవోలు, ఏపీవోలకు ఎన్నికల విధులపై అవగాహన



పీవోలకు అవగాహన కల్పిస్తున్న పరిశీలకుడు నీరజ్‌కుమార్, ఆర్వో రాజకుమారి

మంగళగిరి సిటీ, మే 5: మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వహించాల్సిన ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు రెండు రోజులపాటు జరుగనున్న రెండో విడత శిక్షణా కార్యక్రమం ఆత్మకూరు నిర్మల ఫార్మసీ కళాశాలలో ఆదివారం ప్రారంభమైంది. శిక్షణలో భాగంగా తొలిరోజు 8 మంది మాస్టర్ ట్రైనర్లచే 392 మంది ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు డిస్ట్రిబ్యూషన్ సెంటరు, రిసెప్షన్ సెంటరు, పోలింగ్ కేంద్రాల వద్ద విధుల నిర్వహణ, ఈవీఎం కమిషనింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. జాయింట్ కలెక్టరు, మంగళగిరి ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజకుమారి పర్యవేక్షణలో జరిగిన ఈ శిక్షణా కార్యక్రమాన్ని నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు నీరజ్‌కుమార్ పర్యవేక్షించారు. మంగళగిరి నియోజకవర్గంలో ఓటు హక్కు కలిగి, గుంటూరు జిల్లాలోని మిగిలిన అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ రిసెప్షన్ సెంటర్ల కోసం జిల్లాలోని మిగిలిన ఆరు నియోజకవర్గాలకు ఆరు బృందాలను ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఆర్వో తెలిపారు. సదరు బృందాలకు ఉద్యోగుల నుంచి పోస్టల్ బ్యాలెట్‌లు ఎలా తీసుకోవాలో దశల వారీ ప్రక్రియపై తర్ఫీదు ఇచ్చినట్టు తెలిపారు.

చంద్రబాబు వస్తేనే యువతకు ఉద్యోగావకాశాలు

● టీడీపీ ఎన్‌ఆర్‌ఐ అధ్యక్షుడు వడ్లమూడి రఘునాథబాబు



గొట్టిపాడులో ప్రచారంలో కరపత్రాలు అందజేస్తున్న వడ్లమూడి రఘునాథబాబు

ప్రత్తిపాడు, మే 5: రాష్ట్రంలో చంద్రబాబునాయుడు అధికారంలోనికి వస్తేనే యువతకు మెరుగైన అవకాశాలు వస్తాయని తెలుగుదేశం పార్టీ ఎన్‌ఆర్‌ఐ అధ్యక్షుడు వడ్లమూడి రఘునాధబాబు తెలిపారు. మండలపరిధిలోని గొట్టిపాడులో ఆయన పర్యటించారు. స్థానిక నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఐలు 20 మంది రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ప్రచారం చేశారన్నారు. రాష్ట్రాభివృద్ధిలో తమ వంతు పాత్రగా పార్టీ అధికారంలోనికి రావడానికి మేము యజ్ఞం చేస్తున్నామన్నారు. అభివృద్ధితోనే సంక్షేమం అన్నదే తమ నినాదం అని, అప్పులతో ఏమీ సాధించ లేమన్నారు. ప్రజలు ప్రతి విషయాన్ని గమనించి టీడీపీకి ఓటు వేయాలని ఆయన కోరారు.

సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలందరికీ సంక్షేమం

● తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గాదె పిచ్చిరెడ్డి



కాజ గ్రామంలో ప్రచారం చేస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు

మంగళగిరి సిటీ, మే 5: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి గాదె పిచ్చిరెడ్డి అన్నారు. కూటమి బలపరిచిన మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థి నారా లోకేశ్, గుంటూరు పార్లమెంటు అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ విజయాన్ని కాంక్షిస్తూ మంగళగిరి మండలం కాజ గ్రామంలో ఆదివారం ఆయా పార్టీల నేతలు, కార్యకర్తలు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు, మోడల్ బ్యాలెట్ పత్రాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కలిగే మేలును ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కాజ గ్రామ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, జనసేన అధ్యక్షుడు అప్పికట్ల వెంకటరత్నం నాయుడు, కూటమి నేతలు నంబూరు రవి, బందారు సురేష్, బూనం రాఘవరావు, అప్పికట్ల శివబాబు, చిలకలపూడి రమేష్, జీ.సుధాకర్‌రెడ్డి, శ్రీకాంత్, పల్నాటి భావన్నారాయణ, భూక్యా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అద్దంకమ్మ అమ్మవారి శిడిమాను ఉత్సవం



శిడిమాను ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

వట్టిచెరుకూరు, మే 5: వట్టిచెరుకూరు గ్రామంలోని గ్రామదేవత అద్దంకమ్మ అమ్మవారి తిరునాళ్ళలో ప్రధాన ఘట్టమైన శిడిమాను మహోత్సవం ఆదివారం సాయంత్రం వైభవంగా సాగింది. అమ్మవారి దేవాలయం వద్ద ఉన్న శిడిమానును అందంగా అలంకరించడంతో పాటు రైతులు తాము పండించిన పంటలను శిడిమానుకు అలంకరించి తమ భక్తిని చాటుకున్నారు. సాయంత్రం వేళ అమ్మవారికి మొక్కుబడిగా సమర్పించిన శిరిపోతును గ్రామ ప్రధాన వీధులగుండా మంగల వాయిద్యాలు, కనకతప్పెట్లతో ఊరేగింపుగా తీసుకొని దేవాలయం వద్దకు చేర్చారు. ఉదయం నుంచి అమ్మవారి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. శిడిమాను ఊరేగింపు గ్రామంలోని ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి గుండా గ్రామంలోని బీసీకాలనీ వరకు చేరుకునేందుకు చాలా సమయం పట్టింది. గ్రామస్థులు కుటుంబసభ్యులతో కలిసి వచ్చి శిడిమాను వద్ద మొక్కులు తీర్చుకున్నారు.

సీతామహాలక్ష్మి జ్ఞాపకార్థం వాటర్‌కేంద్రం ప్రారంభం



ఉచిత కూలింగ్ మినరల్ వాటర్‌కేంద్రం ప్రారంభించిన ఉప్పుటూరి రాములు

వట్టిచెరుకూరు, మే 5: మండలపరిధి పుల్లడిగుంట గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన వట్టిచెరుకూరు మాజీ జడ్పీటీసీ స్వర్గీయ ఉప్పుటూరి సీతామహాలక్ష్మి జ్ఞాపకార్థం బాటసారులకు కూలింగ్ వాటర్‌ను కేంద్రాన్ని ఆమె భర్త రాములు ప్రారంభించారు. తన తల్లి ఉప్పుటూరి సీతామహాలక్ష్మి వేసవికాలంలో ప్రతి సంవత్సరం చలివేంద్రాలను ఏర్పాటు చేసి నిర్వహించే వారని, ఆమె ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూనే ఉంటామని తనయుడు ఎన్నారై ఉప్పుటూరి రామ్‌చౌదరి వెల్లడించారు.

ఎకో పార్కును మరో కేబీఆర్ పార్కుగా అభివృద్ధి చేస్తాం

● మంగళగిరి వాకర్స్‌కు బ్రాహ్మణి హామీ



మంగళగిరి ఎకో పార్కులో వాకర్స్‌తో కలిసి వాకింగ్ చేస్తున్న బ్రాహ్మణి

మంగళగిరి, మే 5: లోకేశ్‌ను బ్రహ్మాండమైన మెజారిటీతో గెలిపిస్తే మంగళగిరిలోని ఎకో పార్కును హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్కుకన్నా మిన్నగా అభివృద్ధి చేస్తామని నారా లోకేశ్ సతీమణి బ్రాహ్మణి హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఉదయం టీడీపీ, జనసేన నాయకులతో కలిసి స్థానిక ఎయిమ్స్ ఆస్పత్రి సమీపంలోని ఎకో పార్కును సందర్శించి అక్కడి వాకర్స్‌తో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ తాము ఎదుర్కొంటున్న సమస్యలను బ్రాహ్మణి దృష్టికి తీసుకువచ్చారు. ఐదేళ్లుగా పార్కు నిర్వహణకు తమ సొంత డబ్బులను వెచ్చిస్తున్నామని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల కోటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. పార్కు నిర్వహణ విషయంలో ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదన్నారు. పార్కు ప్రవేశ రుసుంను రద్దు చేయాలని, వాకింగ్ ట్రాక్‌లను నిర్మించాలని, వాకర్స్ సభలు, సమావేశాలను నిర్వహించుకునేందుకు వీలుగా తగిన స్థలాన్ని కేటాయించి షెడ్డు నిర్మించాలని వాకర్స్ ఆమెకు విజ్ఞప్తి చేశారు. కాగా, బ్రాహ్మణి స్పందిస్తూ అధికారంలోకి రాగానే అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. మంగళగిరి అభివృద్ధిపై నారా లోకేశ్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తారన్నారు. మంగళగిరిలో అందరికీ సంక్షేమం - అభివృద్ధి అందడమే ధ్యేయంగా లోకేశ్ పనితీరు ఉండబోతుందన్నారు.

శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

● ఎన్డీఏ ఎమ్మెల్యే అభ్యర్థి బూర్ల రామాంజనేయులు



రామాంజనేయులుకు హారతులతో స్వాగతం పలుకుతున్న స్థానికులు

గుంటూరు(తూర్పు), మే 5: నగర పరిధిలోని శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తామని ప్రత్తిపాడు, ఎన్డీఏ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు అన్నారు. ఆది వారం 41వ డివిజన్ పరిధిలో స్వర్ణభారతినగర్‌లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాడిశెట్టి మురళీమోహన్ కలిసి ఆయ న ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రచారా నికి వచ్చిన నాయకులకు స్థానికులు హారతులతో స్వాగతం పలికి, ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ వైసీపీ నాయకులు శివారు ప్రాంతాల్ని అడ్డాగా మార్చుకుని గంజాయి, ఇతర అక్రమ వ్యా పారాలు నిర్వహించడం సిగ్గుచేటన్నారు. స్థానిక నాయకుల నిర్వాహకంలో యువత గంజాయి, మత్తు పదార్థాల భారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కొంతమంది అధి కారులు సహకరించడం సిగ్గుచేటన్నారు. అధికారంలోకి రాగానే వీటిని పూర్తిగా నిర్మూలించడానికి ప్రత్యేక కార్యాచరణలు రూపొందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే శివారు ప్రాంతాల్లో నెలకొన్న తాగునీరు సమస్యపై శాశ్వత పరిష్కారం చూపుతున్నానని తెలిపారు. తాడిశెట్టి మురళి మాట్లాడుతూ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే పెమ్మసాని చంద్రశేఖర్, బూర్ల రామాంజనే యులును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో 41వ డివిజన్ కార్పొరేటర్ బొడ్డుపల్లి స్మితపద్మజ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇంట సూపర్ సిక్స్ వెలుగులు

● కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం

● మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ



టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్న నర్రా బాలకృష్ణ, నాయకులు

పెదనందిపాడు, మే 5: ఎన్డీఏ కూటమి ఎన్నికల ప్రణాళికలోని సూపర్ సిక్స్ పథకాలతో పేదల ఇంట వెలుగులు విరజిమ్ముతాయని మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ అన్నారు. మండలపరిధిలోని ఆయా గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా బాబును మళ్ళీ రప్పిద్దాం కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో స్థానిక నేతలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు, మేనిఫెస్టో కరపత్రాలను అందజేసి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ జగన్ పాలనలో వెనుకబడిన రాష్ట్రానికి పూర్వ వైభవం రావాలంటే చంద్రబాబును సీఎంను చేయాలన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్ళలో అమలు చేయగల సత్తా ఉన్న నాయకుడు చంద్రబాబు అని, అరాచక వైసీపీ సర్కారును గద్దె దింపాలని పిలుపునిచ్చారు. కూటమి పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి బూర్ల రామాంజనేయులను గెలిపించాలని కోరుతూ ఈవీఎం నమూనాలతో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘ మాజీ అధ్యక్షుడు మాదినేని శౌరిబాబు, మాజీ జడ్పీటీసీ బత్తిని శారదా వేణు, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు చాగంటి సత్యహర్ష, కాంద్రు ప్రసాద్, గ్రామ అధ్యక్షుడు రావి శివరామకృష్ణయ్య, ఏలూరి గోపీప్రసాద్, బండి నాగబాబు, ఆళ్ళ రాజారావు, సందిరెడ్డి ఉమామహేశ్వరరావు, బండి కిరణ్‌కుమార్, కలవకూరి వెంకట్రావు, షేక్ ఖలీల్, ఈదర నాగేశ్వరరావు, నూతి శ్రీనివాసరావు, కుర్రా హరిబాబు, కాపు రాంబాబు, పాటిబండ్ల నాగరాజు, కట్టా రామరాజు, కొమర్నేని రాకేష్, మొవ్వా నవీన్, దిలీప్ ఇస్మాయేల్ పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో యాదవులకు కనీస భద్రత లేదు

● టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుందరరావు యాదవ్



యాదవుల సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న సుందరరావు

మంగళగిరి సిటీ, మే 5: అయిదేళ్ల వైసీపీ పాలనలో యాదవులకు కనీస భద్రత లేకుండా పోయిందని, రాష్ట్ర వ్యాప్తంగా లెక్కకు మించి దాడులు జరిగాయని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళగిరి మండలం నవులూరు గ్రామంలో ఆదివారం యాదవుల సమన్వయ కమిటీ సమావేశం రుద్రు కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. సుందరరావు మాట్లాడుతూ వైసీపీలో యాదవులను జెండాలు మోసే కార్యకర్తలు గానే చూస్తున్నారే తప్ప కనీస గుర్తింపు, గౌరవం లేదన్నారు. ఐదేళ్లలో యాదవులే లక్ష్యంగా రాష్ట్రంలో అనేక చోట్ల యాదవులపై దాడులు జరిగాయన్నారు. అమరావతి కోసం 33 వేల ఎకరాల పైచిలుకు భూమి ఇచ్చిన రైతులను సీఎం జగన్ నమ్మించి మోసం చేశారని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వం కొత్తగా తీసు కువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టు ప్రజలకు శరాఘాతంగా మారనుందని హెచ్చరించారు. మంగళగిరిలో నారా లోకేశ్ ఓడినప్పటికీ ప్రజలకు అందుబాటులో ఉంటూ తన సొంత ఖర్చులతో 29 సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో యాదవ సామాజిక వర్గీయులతో సమావేశాలు నిర్వహించి రాబోయే ఎన్నికల్లో లోకేశ్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని తీర్మానించినట్టు తెలిపారు. జగన్ అసమర్థ పాలనతో అధోగతిపాలైన రాష్ట్రం తిరిగి గాడిలో పడాలంటే రాబోయే ఎన్నికల్లో ప్రజలంతా చంద్రబాబుకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు తోట పార్థసారధి, నేతలు బత్తుల నాగరాజు, చింకా కోటేశ్వరరావు, తోట సాంబయ్య, చావలి ఉల్లయ్య, తోట శ్రీనుబాబు, కోలా వెంకట్రావు, దానబోయిన శంకరరావు, రుద్రు వీరరాఘవులు, తెల్లమేకల లక్ష్మయ్య, కాకర్ల గంగయ్య, రుద్రు రాజారావు, తెల్లమేకల నాగేశ్వరరావు, పైలలా రవి, రుద్ర వెంకట తిరుపతయ్య, తోట సురేష్ పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వం అవినీతిమయం

● టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని



బీసీల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న పెమ్మసాని

గుంటూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం అవినీతిమయమని, వైసీపీ నాయకులు అవినీతిపరులుగా మారారని, చిలకలూరి పేట నుంచి వచ్చిన రజిని అక్రమ వసూళ్లలో రికార్డు సృష్టించగా, కిలారు రోశయ్య అక్రమ మైనింగ్‌తో వేల కోట్లు వెనకేసుకున్నారని గుంటూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ విమర్శించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని ఏ-1 కన్వెన్షన్ హాల్లో ఆదివారం జరిగిన బీసీ నాయకుల ఆత్మీయ సమావేశంలో పెమ్మసాని, పశ్చిమ అభ్యర్థి గల్లా మాధవి ముఖ్య అతిథిగా పాల్గొన్నా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విడుదల రజనీకి ఏ అర్హత లేకపోయినా వైద్య శాఖ మంత్రిగా ఎలా నియమించారని నిలదీశారు. దళితులకు చెందిన 400 ఎకరాల భూములను ప్రభుత్వానికి అప్పగించడం వల్ల ఆమెకు మంత్రి పదవి వచ్చిందని ఆరోపించారు. అతి తక్కువ ఫీజులు తీసుకుంటూ వైద్యం అందించే డాక్టర్లను కూడా కొందరు అవినీతిపరులు వేధిస్తున్నారని, అదేమని అడిగితే ఫీజులు పెంచమని, పెంచిన ఫీజులను ప్రజలపై మోపమని సలహా ఇస్తున్నారని అన్నారు. వైసీపీ తరఫున ఎంపీగా పోటీ చేస్తున్న కిలారు రోశయ్య ప్రజలకు సంబంధించిన 700 ఎకరాల్లో అక్రమ గ్రావెల్ తవ్వి, అవినీతి సంపాదనకు పాల్పడ్డారన్నారు. గడచిన ఐదేళ్లుగా ఆదాయాలు పెరగకపోయినా నిత్యవసరాలు, పెట్రోలు, ఇతర ధరలు మాత్రం ఆకాశాన్ని అంటాయన్నారు. మద్యం కాస్తా ప్రాణాంతకమైన రసాయనాలతో నిండిపోయి ప్రాణాలు తీస్తోందన్నారు. గల్లా మాధవి మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో ఈ జగన్ ప్రభుత్వం, ఆ పార్టీ నాయకులు భవన నిర్మాణ కార్మికుల పొట్టకొట్టారన్నారు. క్వారీలను అన్యాక్రాంతం చేస్తూ తమ పార్టీ నాయకులకు ప్రభుత్వం కట్టబెట్టిందన్నారు. వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి, వందల కోట్లను కేటాయించి టీడీపీ ప్రభుత్వం అభివృద్ధి చేసిందని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం కార్పొరేషన్‌కు నయా పైసా నిధులు ఇవ్వకుండా అవమానించిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ నేతలు మల్లె ఈశ్వరరావు, తన్నీరు ఆంజనేయులు, వడ్డే వెంకట్, చంద్రగిరి బాబు, జాన్ సైదా తదితరులు పాల్గొన్నారు.

యాదవులకు అండగా తెలుగుదేశం పార్టీ : పెమ్మసాని

గుంటూరు, మే 5(ఆంధ్రజ్యోతి): యాదవ సోదరుల్లో ఎంతోమంది నాయకులను తయారుచేసిన ఘనత అన్న ఎన్టీఆర్, టీడీపీకే దక్కుతుందని పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరులోని స్థానిక ఏ కన్వెన్షన్ హాల్లో బీసీ సోదరుల ఆత్మీయ సమావేశం ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ సమావేశంలో పెమ్మసాని, గల్లా మాధవి, బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పెమ్మసాని మాట్లాడుతూ చంద్రబాబు ఎక్కడికి వెళ్లినా యనమల రామకృష్ణుడిని తన పక్కనే ఉంచుకోవడం యాదవులకు ఆయన ఇచ్చే గౌరవమన్నారు. కానీ జగన్ పక్కన పెట్టుకోవడం సంగతి దేవుడెరుగు, కనీసం యాదవులను గుర్తించే పరిస్థితి కూడా లేదన్నారు. గల్లా మాధవి మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకి మధ్య వారధి లాగా పని చేసేందుకు సంసిద్ధమై వస్తున్నాం. ప్రజలు ఎప్పుడూ గుర్తు పెట్టుకునేలా సేవలు చేయాలనేదే తమ ధ్యేయమని ఆమె అన్నారు. ప్రభుత్వం అందించే అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందించాలనే బలమైన నిర్ణయంతో వస్తున్నామని, మీరు అందించే సహాయ సహకారాలను దృష్టిలో ఉంచుకొని అందరి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ యాదవులు ఏదైనా మాట ఇవ్వడానికి ఆలోచిస్తారేమో గాని, మాట ఇస్తే మాత్రం ప్రాణం పోయినా కట్టుబడి ఉంటారన్నారు. ఒకసారి సర్దుకుపోయి పని చేయడం మొదలుపెడితే విజయ తీరాలకు చేరే వరకు కృషి చేస్తామన్నారు. ఎన్డీఏ కూటమి విజయానికి మా సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో తాళ్ల వెంకటేష్ యాదవ్, కుమ్మర క్రాంతి కుమార్, అడక శ్రీనివాసరావు, యాదవ నాయకులు తట్టుకోల కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

గోమాంస అక్రమ రవాణపై అధికారుల తీరు విచారకరం : శివస్వామి

గుంటూరు(తూర్పు), మే 5: జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో గోమాంసం అక్రమ రవాణ జరుగుతుందని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవడంపై శైవ క్షేత్ర పీఠాధిపతి శివస్వామి విచారం వ్యక్తం చేశారు. బ్రాడీపేటలోని విశ్వ హిందు పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లే జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో దాదాపు 6 వేల కేజీల గోమాంసం తరలిస్తున్నారని రాతపూర్వకరంగా జీఆర్‌పీఎఫ్, ఆర్‌పీఎఫ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ రవాణను అడ్డుకోకుండా పైగా గోరక్షకులపై అనుచితంగా ప్రవర్తించడం దారుణమన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న పెమ్మసాని శ్రీరత్న

మహిళల ఆర్థికాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

● పెమ్మసాని శ్రీరత్న

మంగళగిరి, మే 5: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని టీడీపీ గుంటూరు పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సతీమణి పెమ్మసాని శ్రీరత్న తెలిపారు. నందివెలుగు కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ బ్యాంకు లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరిలోని నన్నపనేని లక్ష్మీకల్యాణ మండపంలో మహిళాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీరత్న మాట్లాడుతూ ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వాల కనీస బాధ్యత అన్నారు. నేడు రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ఉపాధికి దూరమయ్యారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలలో రాజకీయాలను మెలికపెట్టి టీడీపీ సానుభూతి పరులకు సంక్షేమ ఫలాలు అందనివ్వకుండా చేయడం సమంజసం కాదన్నారు. వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాల కన్నా ప్రచార ఆర్భాటాలకే ఎక్కువ ఖర్చు చేసిందని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజకీయాలకు అతీతంగా పేదలకు ఇళ్ల స్థలాలు, సొంత ఇంటి నిర్మాణం చేపట్టడం జరుగుతుంద న్నారు. పెమ్మసాని ఫౌండేషన్ ద్వారా మహిళలకు అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తామన్నారు. రాష్ట్రం బాగుపడాలన్నా, సంక్షేమ ఫలాలు అందరి దరిచేరాలన్నా రాబోయే ఎన్నికల్లో టీడీపీకి అండగా నిలవాలని కోరారు. మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థిగా నారా లోకేశ్, గుంటూరు ఎంపీ అభ్యర్థిగా పెమ్మసాని చంద్రశేఖర్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కాగా, నంది వెలుగు సొసైటీ బ్యాంకు ఛైర్మన్ తోట లక్ష్మీకోటేశ్వరరావు మహిళలకు ఆర్థిక చేయూత, సూక్ష్మ రుణ సదుపాయాలు, గ్రూపు రుణాలు వంటి అంశాలను వివ రించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, సొసైటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

గుండిమెడలో విస్తృత ప్రచారం



గుండిమెడలో ప్రచారం నిర్వహిస్తున్న కొమ్మారెడ్డి కిరణ్ తదితరులు

తాడేపల్లి, మే 5: టీడీపీ మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థి నారా లోకేశ్‌ను, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరుతూ శనివారం రాత్రి గుండిమెడలో టీడీపీ తాడేపల్లి మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కొమ్మారెడ్డి కిరణ్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తాడేపల్లి మండల ఉపాధ్యక్షుడు గుండిమెడ రమేష్‌బాబు, గ్రామ అధ్యక్షుడు చిగురుపాటి సుబ్బారావు, జనసేన గ్రామ అధ్యక్షుడు జెట్టి రమేష్, టీడీపీ గ్రామ ప్రధాన కార్యదర్శి నామతోటి రాంబాబు, మహిళా అధ్యక్షురాలు నామతోటి ఝాన్సీ, ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షురాలు నాగేంద్రం, పాలకుర్తి శ్రీనివాసరావు, అనుమోలు వీరాంజనేయ ప్రసాద్, అనుమోలు సాంబశివరావు, పాటిబండ్ల నాగేశ్వరరావు, దున్నా కరుణాకర్, గంజి రమేష్, నాయకులు, కార్యకర్తలు దొంతగాని భార్గవ్, క్రోసూరు నరసింహారావు పాల్గొన్నారు.

చిర్రావూరులో...

ఎంటీఎంసీ పరిధిలోని చిర్రావూరులో గ్రామ టీడీపీ అధ్యక్షుడు వీరిశెట్టి శ్రీనివాస్, జనసేన అధ్యక్షుడు అంకం కాళీకృష్ణ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ జనసేన శ్రేణులు పాల్గొన్నారు.

సీతానగరంలో కూటమి నేతల ప్రచారం



సీతానగరంలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

తాడేపల్లి టౌన్, మే 5: ఎన్డీఏ కూటమి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఆదివారం సాయంత్రం ఎంటీఎంసీ పరిధిలోని సీతానగరం గాంధీ బొమ్మ సెంటర్ ఏరియాలో టీడీపీ, బిజెపి, జనసేన నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు వల్లభనేని వెంకట్రావు, ఇట్టా భాస్కర్, గాడి శివ, అంబటి తిరుపతిరావు, సదాశివరావు, కొండలరావు పాల్గొన్నారు.

బడేపురంలో జనసేన ఎన్నికల ప్రచారం



బడేపురంలో ఎన్నికల ప్రచారాన్ని చేస్తున్న జనసేన పార్టీ శ్రేణులు

తాడికొండ, మే 5: తాడికొండ శివారు బడేపురం గ్రామంలో జనసేనపార్టీ నాయకులు ఆదివారం ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఎన్డీఏ కూటమి మ్యానిఫెస్టోపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పలువురు జనసేన పార్టీ నాయకులు మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని అన్నారు. అమరావతి ఏకైక రాజధానిగా ఉండాలన్నా, పోలవరం పూర్తి కావాలన్నా, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు రావాలన్నా, మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నా ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం టీడీపీతోనే పవన్‌కల్యాణ్ పొత్తు పెట్టుకున్నారన్నారు.

దుష్టపాలనకు చరమగీతం పాడేందుకు సిద్ధం

● మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణ

పెదనందిపాడు, మే 5 : వైసీపీ దుష్ట పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణ అన్నారు. మండలపరిధిలోని అబ్బినేనిగుంటపాలెంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఓ ఒక్క వర్గం సంతోషంగా లేదని, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఉందని, ఒక్కఛాన్స్‌తో అధికారంలోకి వచ్చిన జగన్ పాలనతో రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారన్నారు. ప్రజలను నట్టేట ముంచారన్నారు. వ్యవస్థలన్నీ నిర్వీర్యం చేశారని, నాయకులు, కార్యకర్తలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. కేంద్రం నిధులను దారి మళ్ళించి, సంక్షేమాన్ని పూర్తిగా అట్టడుగుకు చేర్చారన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్య ర్థులు పెమ్మసాని, బూర్లను సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రావిపాటి కృష్ణప్రసాద్, నాయకులు ఎం వాసు, పి.కుటుంబరా వు తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

పొన్నూరులో జన సునామీ

- పవన్‌ని చూసి పులకించిన పొన్నూరు
- మండుటెండను లెక్కచేయని జనసైనికులు, టీడీపీ శ్రేణులు
- అభిమానులతో కిక్కిరిసిన రహదారులు



పవన్ కల్యాణ్‌కు కుటుంబ సభ్యులను పరిచయం చేస్తున్న నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్, మే 5: జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పొన్నూరు వచ్చిన సందర్భంగా ఆదివారం పొన్నూరు వీధులు జన సునామీని తలపించాయి. తొలిసారిగా పొన్నూరు గడ్డపై అడుగుపెట్టిన పవన్ కల్యాణ్‌ను చూసి పొన్నూరు ప్రజలు పులకించిపోయారు. వారాహి విజయభేరి యాత్రలో భాగంగా కూటమి అభ్యర్థులైన ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, పెమ్మసాని చంద్రశేఖర్ల తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు పవన్ కల్యాణ్ పొన్నూరు విచ్చేశారు. జీబీసీ రోడ్డులోని సజ్జా కల్యాణ మండపం సమీపంలో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్ వద్ద ఉదయం నుంచే జనసైనికులు వేచివున్నారు. అభిమాన నేతను అత్యంత సమీపం నుంచి చూసేందుకు అభిమానులు గంటల తరబడి వేచి ఉన్నారు. పవన్‌కల్యాణ్ పర్యటన ఉదయం 10గంటలకు ప్రారంభం అవుతుందని నిర్వాహకులు ప్రకటించినప్పటికీ మూడుగంటలు ఆలస్యంగా పవన్ పొన్నూరు విచ్చేశారు. అప్పటికే పొన్నూరు పరిసర ప్రాంతాలకు చెందిన, టీడీపీ, జనసేన, బీజేపీ అభిమానులు పవన్ కోసం పట్టణ వీధుల్లోకి ప్రవేశించటంతో వీధులు అన్నీ జన ప్రవాహాన్ని తలపించాయి. ఎటుచూసినా కదం తొక్కే యువత ఉరకలెత్తే ఉత్సాహంతో ముందుకు సాగారు. 12.30 గంటల సమయంలో హెలీప్యాడ్ వద్దకు చేరుకున్న పవన్ కల్యాణ్‌కు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, జ్యోతిర్మయి దంపతులు, వారి కుమార్తె నాగసాయి వైదీప్తి, ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఘనస్వాగతం పలికారు. పుష్పగుచ్చాలు అందచేసి పొన్నూరుకు స్వాగతం పలికారు. అక్కడ నుంచి రెండు కిలోమీటర్ల మేర ర్యాలీ జరిగింది. అడుగడుగునా యువత, జనసైనికులు, పవన్ కల్యాణ్‌కు బ్రహ్మరథం పట్టారు. పవన్ కల్యాణ్ కూడా వాహనంపై నుంచి అభిమానులకు అభివాదం చేస్తూ ముందుకుసాగారు. రెండు కిలోమీటర్ల మేర సాగిన కాన్వాయ్ యాత్ర జన సునామీని తలపించింది. ఎన్జీరంగా విగ్రహం వద్ద ఉన్న బహిరంగ సభా వేదికకు చేరుకునేందుకు పవన్ కల్యాణ్ వాహనశ్రేణి, వ్యయప్రయాసలు ఎదుర్కోవలసి వచ్చింది. మార్గమధ్యలో యన్నం నాయుడు ఆధ్వర్యంలో భారీ గజమాలతో పవన్ కల్యాణ్‌ను సత్కరించారు. ఈ బహిరంగ సభకు యువతతోపాటు, పొన్నూరు పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు, యువతులు, చిన్నారులు భారీగా చేరుకోవటంతో సభా ప్రాంగణం మహిళలతో నిండిపోయింది. మహిళలు కూడా ఉరిమే ఉత్సాహంతో పవన్ కల్యాణ్ యాత్రలో పాల్గొన్నారు.



పొన్నూరులో అశేష జన వాహిని నడుమ పవన్ కల్యాణ్ ర్యాలీ



పొన్నూరులో పవన్ కల్యాణ్‌కు వేస్తున్న గజమాల

ప్రముఖులను గుర్తు చేసుకున్న పవన్ కల్యాణ్

పొన్నూరు వారాహి విజయభేరీ యాత్రలో భాగంగా ప్రసంగించిన పవన్ కల్యాణ్ పొన్నూరు ప్రముఖులను సభా వేదికగా గుర్తు చేసుకున్నారు. రైతు ఉద్యమ నేతగా సుదీర్ఘ పార్లమెంటేరియన్‌గా ఖ్యాతి గాంచిన ఆచార్య ఎన్జీరంగా పొన్నూరు వాసేనని, ఎన్జీరంగా వల్లనే పొన్నూరుకు ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. అలాగే సంగం డెయిరీ వ్యవస్థాపకుల్లో ఒకరైన ధూళిపాళ్ళ వీరయ్య చౌదరిని గుర్తుచేశారు. చేనేత ఉద్యమ నేత ప్రగడ కోటయ్య పొన్నూరు వాసేనన్నారు. అలాగే తండ్రి ఉద్యోగ బాధ్యతలో భాగంగా తమ కులదైవం ఆంజనేయస్వామి ఆలయానికి చిన్ననాడు వచ్చిన సంఘటనలను గుర్తు చేసుకున్నారు. జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబు పవన్ కళ్యాణ్‌కు అందచేసిన తమలపాకులను చూసి హర్షం వ్యక్తంచేస్తూ పొన్నూరు ప్రాంతం తమలపాకు పంటకు ప్రసిద్ధి అన్నారు. అలాంటి తమలపాకు పంటకు గిట్టుబాటు ధర కల్పించేలా కృషి చేస్తానని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు.

తొణికిసలాడిన ఉత్సాహం....

మరో వారం రోజుల్లో పోలింగ్ తేదీ దగ్గరగా ఉండటంతో పవన్ కల్యాణ్ పొన్నూరు పర్యటన కూటమి పార్టీలో ఉత్సాహాన్ని నింపింది. వైసీపీలో పవన్ సామాజికవర్గంకు చెందిన అంబటి మురళి పోటీలో ఉన్నారు. గత కొద్ది రోజులుగా అంబటి పవన్ సామాజికవర్గ ఓట్లతోపాటు జనసైనికుల ఓట్లు తమకే పడతాయని విస్తృతంగా ప్రచారం సాగించారు. అయితే పవన్ కల్యాణ్ పొన్నూరు వచ్చి వైసీపీ నాయకుల చర్యలను ఎండకట్టడమే కాకుండా గతంలో వారు చేసిన అరాచకాలు, దౌర్జన్యాలు, దోపిడీలను ప్రజలకు గుర్తుచేశారు. అలాగే కూటమి అభ్యర్థులకు వేసే ఓట్లు తనకు వేసినట్లుగానే భావించాలని సభాముఖంగా ప్రకటించటంతో జనసైనికుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఇప్పటివరకు వైసీపీ అభ్యర్థులు సామాజికవర్గాల పేరుతో కులాల కుంపట్లు రగిల్చి లబ్ధిపొందాలని చేసిన ప్రయత్నాలు పవన్ కల్యాణ్ పర్యటనతో పటాపంచలయ్యాయని జనసైనికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌ను వైసీపీ ప్రభుత్వం పెట్టిన ఇబ్బందులు, నమోదుచేసిన అక్రమ కేసులు, జైలు పాలు చేసిన సంఘటనల గురించి పవన్ కల్యాణ్ లేవనెత్తటం ప్రతి ఒక్కరినీ ఆలోచింపచేసింది. అలాగే పవన్ కల్యాణ్ తన పర్యటనను అడ్డుకునేలా వైసీపీ మూకలు హెలీప్యాడ్‌ను తవ్వివేయటంపై సంధించిన వ్యంగాస్త్రాలకు జనసైనికులు కేరింతలు కొట్టారు. వైసీపీ నాయకులకు తవ్వటం తప్ప నిర్మించటం రాదని ఎద్దేవా చేయటంతో జనసైనికులు చేసిన నినాదాలు పట్టణ వీధులను మారుమోగాయి. పవన్ పర్యటనతో కూటమి పార్టీలకు మరింత ఉత్తేజాన్ని ఇచ్చింది.



అభిమానులకు పవన్ కల్యాణ అభివాదం



సభలో ప్రసంగిస్తున్న ధూళిపాళ్ల నరేంద్రకుమార్, పక్కన ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్

పవన్ రాకతో అసురపాలనకు అంతం: ధూళిపాళ్ళ

పొన్నూరు టౌన్, మే 5: జనసేనాని పవన్ కళ్యాణ్ పొన్నూరులో అడుగుపెట్టడంతో అసురపాలన అంతమేనని మాజీ ఎమ్మెల్యే సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. ఆదివారం పొన్నూరు పట్టణంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ వారాహి విజయభేరి సభ జరిగింది. సభలో నరేంద్ర కుమార్ మాట్లాడుతూ అధికారం ఉందని అహంకారంతో వైసీపీ నాయకుడు వ్యవహరిస్తునాడని ఆరోపించారు. దురహంకారంతో పవన్ కల్యాణ్ పర్యటనను అడ్డుకునేందుకు హెలిప్యాడ్‌ను ధ్వంసం చేశారని దుయ్యబట్టారు. వైసీపీ కుయుక్తులు పన్నినప్పటికి పవన్ కల్యాణ్ పర్యటనకు వచ్చిన జనసముద్రాన్ని చూసైనా బుద్ధి తెచ్చుకోవాలని వైసీపీ నాయకులకు హితవు పలికారు. మాజీ క్రికెటర్ అంబటి రాయుడు మాట్లాడుతూ పుట్టినగడ్డ పొన్నూరు బిడ్డగా వచ్చానన్నారు. పొన్నూరు ప్రాంతం అభివృద్ధిలో ఐదేళ్లుగా వెనకబడిపోయిందన్నారు. ప్రజలు వైసీపీ తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని పిలుపునిచ్చారు. ఈ సభలో జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, సమన్వయకర్త వడ్రాణం మార్కండేయ బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, పొన్నూరు ఇన్‌చార్జి సుధాకర్, మూడు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో కలిసి సభలో ప్రసంగిస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్

వైసీపీతో రాష్ట్రానికి తీరని నష్టం

● మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, మే 5: ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రానికి తీరని నష్టం జరిగిందని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 23వ వార్డులో వైసీపీ నుండి టీడీపీలోకి చేరిన పలువురు నాయకులు, కార్యకర్తలను అభినందించి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అంతకుముందు తెనాలి నియోజవర్గ పార్టీ కార్యాలయంలో పట్టణానికి చెందిన పలువురు మహిళలు వైసీపీని వీడి ఆలపాటి సమక్షంలో టీడీపీలో చేశారు. ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వైసీపీకి అధికారం ఇచ్చిన రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసుకున్నామన్నారు. ధరలు పెరిగి సామాన్యుడికి అందని ద్రాక్షగా మారాయి. నిరుద్యోగులు పెరిగిపోయారు. ఎక్కడా చూసినా రౌడీయిజం.. దాడులు ఇదేపాలన తిరిగి పార్టీల కతీతంగా ప్రజలు ఆహ్వానిస్తారా..? భావితరాల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మిగులుస్తారా.. ఆలోచించే సమయం ఆసన్నమైందన్నారు. ఇకనైనా ప్రజలందరూ కూటమివైపు అడుగులు వేయాలన్నారు. గతంలో పాదయాత్రగా ప్రజల్లోకి వచ్చిన జగన్ అనేక మాయమాటలు చెప్పి, కోడికత్తి డ్రామాతో ప్రజల్లో సానుభూతిని నింపుకుని, వివేకానంద హత్య అప్పటి అధికార పార్టీ టీడీపీ పైకి నెట్టి అధికారంలోకి వచ్చాడని విమర్శించారు. మాయమాటలు దొంగ డ్రామాలతో అధికారంలోకి వచ్చిన జగన్ దాదాపుగా నాలుగున్నరేళ్ల ప్రజలకు కనిపించకుండా ప్యాలెస్‌లోనే ఉంటూ పాలనను గాలికొదిలేశాడని ఆరోపించారు. పేదవాడి సంక్షేమం పేరుతో పెద్దఎత్తున వేల కోట్ల రూపాలయలు దోచుకున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని తీవ్రంగా విమర్శించారు. తెనాలి ప్రాంతంలో లోకల్ లోకల్ అని చెప్పుకునే ఎమ్మెల్యే ఇసుక, పేదల స్థలాల పేరుతో రూ. వేల కోట్లు అవినీతికి పాల్పడ్డాని ఆరోపించారు. తెనాలిలో లోకల్ నాయకుడు జగన్‌తో తెనాలి వ్యవసాయమార్కెట్ ప్రాంగణంలో చెప్పించి ముస్లింల షాదీఖానా.. నాలుగులైన్ల రోడ్డు, మునిసిపల్ బిల్డింగ్, ఇలాంటి పలు హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. తాము చెప్పేవి అసత్యాలు కావని మీరందరూ విన్నవేనని గుర్తుచేశారు. రాష్ట్రం, మన ప్రాంతం అభివృద్ధిలో నడిచి ప్రజలందరూ సంతోషంగా జీవించాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆలపాటి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో ఉమ్మడి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

అభివృద్ధిపథం కూటమి లక్ష్యం

● జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల

కొల్లిపర, మే 5: రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపాలన్నదే జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి లక్ష్యమని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తూములూరులో వైసీపీ నాయకుడు అడపా నారాయణరెడ్డి తన అనుచరులతో జనసేన పార్టీలోకి చేరటంతో మనోహర్ వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ నారాయణరెడ్డి గతంలో తనకు దగ్గరగా ఉన్నారని వైసీపీలోకి వెళ్ళి మరలా సొంతగూటికి చేరినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో కుంటుపడిందని మరలా అభివృద్ధి చెందాలంటే పవన్ కళ్యాణ్, చంద్రబాబునాయుడు, నరేంద్రమోడీ నాయకత్వం ఎంతైనా అవసరమన్నారు. మన ప్రాంతాన్ని మరలా అభివృద్ధి చేసుకోవాలంటే అమరావతి రాజధాని ఎంతైనా అవసరమన్నారు. చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ కలిసి ప్రకటించిన ఉమ్మడి ప్రణాళిక రైతులకు, కౌలు రైతులకు, మహిళలకు, పేదప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. పవన్ కల్యాణ్ కూడా కొల్లిపర సమీపంలో కృష్ణానదిలో చెక్ డ్యామ్ ఏర్పాటుచేసి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయటానికి మాటఇచ్చినట్లు తెలిపారు. గతంలో ఒక ప్రణాళికతో కొల్లిపర మండలాన్ని అభివృద్ధిలో జిల్లాలోనే ప్రథమస్థానంలో నిలిపినన్నారు. ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలంటే రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులుగా పోటీచేస్తున్న ఎంపీ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను సైకిల్ గుర్తుపై, ఎమ్మెల్యే అభ్యర్థి తనకు గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. సమావేశంలో జనసేన మండల అధ్యక్షుడు యర్రు వెంకయ్యానాయుడు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గుదిబండి గోవర్ధనరెడ్డి, కట్టా శ్రీహరిరెడ్డి, భీమవరపు వేణుగోపాల్‌రెడ్డి, భీమవరపు కిశోర్‌రెడ్డి, కొండా కిశోర్‌రెడ్డి, చాగంటి నారాయణరెడ్డి, కొల్లి కోటిరెడ్డి, ఉయ్యూరు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొల్లిపరలో బ్యాలెట్ నమూనాతో ప్రచారం నిర్వహిస్తున్న మనోహరం

భట్రాజుల కుటుంబాల్లో వెలుగులు నింపుతాం: నాదెండ్ల

తెనాలి రూరల్, మే 5: ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధికి నోచుకోక అంధకారంగా మిగిలిన భట్రాజుల కుటుంబాల్లో తిరిగి వెలుగులు నింపుతామని కూటమి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 12వ వార్డులో సత్యసాయిబాబా కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన భట్రాజుల ఆత్మీయ సమావేశంలో నాదెండ్ల మనోహర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న మనోహర్‌ను, ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్‌ను గెలిపించాలన్నారు. తొలుత సమావేశానికి విచ్చేసిన మనోహర్‌ను సంఘసభ్యులు, మహిళలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భట్రాజుల సంఘనాయకులు, సభ్యులు, ఉమ్మడి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

డాక్టర్ మనోహరం ప్రచారం

తెనాలి రూరల్, మే 5: ప్రజలందరికీ మంచి చేసే కూటమి అభ్యర్థులను రానున్న ఎన్నికల్లో గెలిపించాలని జనసేన పీఏసీ చైర్మన్, తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ సతీమణి డాక్టర్ మనోహరం అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మనోహరం ఆదివారం పట్టణంలోని 35వ వార్డులోని ఉమ్మడి పార్టీ శ్రేణులతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహరం వార్డులోని చిరువ్యాపారులను, నివాసితులను కలిసి బ్యాలెట్ నమూనాలో గుర్తులు చూపుతూ ఓట్లు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఉమ్మడి పార్టీ శ్రేణులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కొల్లిపరలో...

కొల్లిపర, మే 5: రాష్ట్ర ప్రగతి ఎన్డీఏ కూటమితోనే సాధ్యమని ఉమ్మడి పార్టీల తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ సతీమణి డాక్టర్ మనోహరం అన్నారు. ఆదివారం మండల కేంద్రం కొల్లిపరలో ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్, ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ల గెలుపుకోసం ఆ పార్టీ శ్రేణులతో కలిసి మనోహరం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా మండల పరిధిలోని చెముడుబాడు, దావులూరు గ్రామాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ నాదెండ్ల మనోహర్ కుమారుడు మిథుల్ ప్రచారం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు భీమవరపు చినకోటిరెడ్డి, యర్రు వెంకయ్యానాయుడు, భీమవరపు కిశోర్‌రెడ్డి, కట్టా శ్రీహరిరెడ్డి, భీమవరపు వేణుగోపాల్‌రెడ్డి, ఎన్టీఆర్ కోటిరెడ్డి, పొనుగుపాటి నాగేశ్వరరావు, పెరికల రాంబాబు, పోసా చౌడేశ్వరరావు, షేక్ బాజీ, మండ్రు రాంబాబు, అద్దంకి శ్రీను, దాసరి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం చేస్తున్న నాదెండ్ల మనోహర్

తెనాలి 39, 40 వార్డుల్లో మనోహర్ ప్రచారం

తెనాలి రూరల్, మే 4: తెనాలి ప్రాంతంలో వైసీపీ హయాంలో గంజాయి మత్తుతో దాడులు చేసే పాలన కావాలో.. ప్రశాంత వాతావరణంలో జీవనంసాగిస్తూ మంచి చేసే పాలన కావాలో ప్రజలే ఆలోచించి ఓటు వేయాలని కూటమి తెనాలి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. తెలుగుజన చైతన్య పాదయాత్రలో భాగంగా కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ ఉమ్మడి పార్టీ శ్రేణులతో కలిసి ఆదివారం పట్టణంలోని 39,40వ వార్డులో ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా తెనాలిలో నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో రౌడీయిజం పెరిగిపోయిందని ఆరోపించారు. తెనాలిలో దాడుల సంస్కృతికి అంతం పలకావాలంటే రానున్న ఎన్నికల్లో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న నాదెండ్ల మనోహర్‌ను గాజుగ్లాసు గుర్తుపై, ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్‌ను సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తొలుత వార్డు పర్యటనకు వచ్చిన మనోహర్‌ను ఉమ్మడి పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. మాజీ మంత్రి నన్నపనేని రాజకుమార్, టీడీపీ రాష్ట్ర నాయకులు కత్తెర సురేష్‌కుమార్, పలువురు ఉమ్మడి పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు

ముస్లింల సంక్షేమానికి టీడీపీ ప్రాధాన్యం

● ధూళిపాళ్ల నరేంద్ర కుమార్



ఇట్టికంపాడు రోడ్డులో ముస్లింలతో ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్, మే 5: ముస్లింల సంక్షేమానికి టీడీపీ ప్రాధాన్యం ఇస్తుందని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అనాన్నారు. ఆదివారం తనను కలసిన ముస్లిం నాయకులతో మాట్లాడుతూ టీడీపీ ఆత్మీయ బంధువులుగా పొన్నూరు నియోజకవర్గంలో ధూళిపాళ్ళ కుటుంబం నిలుస్తుందన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి వెంట ముస్లీం మైనార్టీలు నడిచారని గుర్తు చేశారు. ఎందరో ముస్లీం యువతపై ఆనాటి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి వేధిస్తే వీరయ్య చౌదరి ప్రభుత్వ అరాచకాలను ఎదుర్కొని ముస్లీంలకు రక్షణ కవచంగా నిలిచారన్నారు.

వీవర్స్ సొసైటీ అభివృద్ధికి సహకరిస్తాం : ధూళిపాళ్ళ

పొన్నూరు టౌన్, మే 5: చేనేత కార్మికులు సంక్షేమం కోసం వీవర్స్ సొసైటీ అభివృద్ధికి సహకరిస్తామని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. పట్టణంలోని వీవర్స్ కోఆపరేటీవ్ సొసైటీ చైర్మన్, వైసీపీ నాయకుడు ప్రగడ వీరభద్ర బాలాజీ ఆదివారం ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. విద్యానగర్‌లోని బాలాజి గృహానికి విచ్చేసిన నరేంద్ర కుమార్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ప్రగట కోటయ్య వారసులు తెలుగుదేశం పార్టీలో చేరటం హర్షనీయం అన్నారు. వైసీపీ ప్రభుత్వంలలో చేనేత పరిశ్రమకు జరుగుతున్న ఇబ్బందులను బాలాజీ తన దృష్టికి తీసుకువచ్చారని కూటమి ప్రభుత్వంలో చేనేతరంగ అభ్యున్నతికి పాటుపడతామన్నారు. నేత కార్మికులకు రాయితీలు ఇచ్చి ఆదుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



పెదకాకానిలో ఓట్లు అభ్యర్థిస్తున్న నరేంద్ర కుమార్

సూపర్ సిక్స్‌తో ప్రతి కుటుంబానికి లబ్ధి

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), మే5: కూటమి ప్రభుత్వంలో అమలు కానున్న సూపర్ సిక్స్ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి జరుగుతుందని ధూళిపాళ్ళ నాగసాయి వైదీప్తి అన్నారు. చేబ్రోలు మండలం శేకూరులో ఆదివారం కూటమి అభ్యర్థుల తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ గెలుపు కోసం గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేసే సంక్షేమ పథకాల కరపత్రాలను పంచిపెట్టారు. ప్రజల సమస్యలలు అడిగి తెలుసుకొని తండ్రి తరపున హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పెదకాకానిలోని నరేంద్ర విస్తృత పర్యటన

పెదకాకాని, మే 5: సైకిల్ గుర్తుకే మన ఓటు అంటూ పెదకాకానిలో పొన్నూరు కూటమి అభ్యర్థి దూళిపాళ్ల నరేంద్ర కుమార్ విస్తృతంగా ఆదివారం పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయన సంకూరి వారి పేట మరియు పుష్పరాజు కాలనీ, నూర్ భాషా కాలనీ, ఎస్టీ ఏకలవ్య నగర్, యాదవ పాలెం, రజకపాలెం, దర్గా ఏరియా, లూధరగిరి యువజననగర్‌లో సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నూరు ఉమ్మడి అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌తో ప్రజలు పలు సమస్యలను దృష్టికి తెచ్చారు. దీనిపై నరేంద్రకుమార్ స్పందిస్తూ సమస్యలను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ , తెలుగుదేశం, జనసేన బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



శేకూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ధూళిపాళ్ళ నాగసాయి వైదీప్తి



పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించుకునేందుకు వేచివున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌పై ఉద్యోగుల్లో అసహనం

● ఎన్నికల అధికారులపై ఉద్యోగుల ఆగ్రహం

పొన్నూరు టౌన్, మే 5: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు కేటాయించే పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రం నిర్వహణపై ఉద్యోగులు తీవ్ర అసహనంతో ఉన్నారు. పొన్నూరు నియోజకవర్గంలో 2412 మంది పోస్టల్ బ్యాలెట్ కోసం ఉద్యోగ ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. వీరే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి ఎన్నికల విధులకోసం పొన్నూరు వచ్చిన ఉద్యోగులు సైతం పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ప్రయత్నం చేసారు. అయితే పొన్నూరు పట్టణం నుంచి 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న వీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉద్యోగుల ట్రైనింగ్ సెంటర్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. అయితే ట్రైనింగ్ సెంటర్ వద్ద సౌకర్యాలు సక్రమంగా లేవని పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో పోస్టల్ బ్యాలెట్ వినియోగ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ట్రైనింగ్ క్లాసులకు హాజరై అక్కడి నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పోలింగ్ కేంద్రానికి చేరుకునేందుకు తీవ్ర వ్యయ ప్రయాసలకు గురయ్యారు. తీరా పోలింగ్ స్టేషన్‌కి వెళ్తే కొందరి ఉద్యోగుల ఓటింగ్ తేదీ వేరే తేదీతో ఉండటంతో అధికారులు ఓటింగ్ వేసేందుకు అనుమతించలేదు. అలాగే శిక్షణ ఒక రోజు, ఓటు వేసేందుకు వేరే రోజు కేటాయించటం సరికాదని ఉద్యోగులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. పోలింగ్ కేంద్రంలో కూడా సరైన ఏర్పాట్లు చేయకపోవటం, సరైన తాగునీటి సౌకర్యం లేకపోవటం పట్ల ఉద్యోగులలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేవలం ఎన్నికల అధికారులలు వైఫ్యలం చెందారని అందువల్లనే ఓటింగ్ విధానం అస్తవ్యస్తంగా మారిందని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

చలివేంద్రం ప్రారంభం

తెనాలి, మారీసుపేట మే 5: చెంచుపేటలోని ఆర్‌పీఎం క్లబ్ వద్ద జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్ మాట్లాడుతూ దాతల సంఘ సభ్యుల సహకారంతో పాదచారులకు పట్టణ ప్రజలకు మజ్జిగ, తాగునీరు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో షేక్ రఫీల్లా, షేక్ ఖాజామొహిద్దిన్, నన్నే, బుజ్జి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

96 మద్యం బాటిళ్లు స్వాధీనం

పొన్నూరు టౌన్, మే 5: మండల పరిధిలోని దండమూడి గ్రామంలో సెబ్ అధికారులు ఆదివారం 96 మద్యం బాటీలు స్వాధీనం చేసుకున్నారు, సెబ్ సిఐ కధనం ప్రకారం దండమూడి గ్రామానికి చెందిన అల్లాడి ప్రభాకర్ మద్యం బాటీలు అనదికారికంగా కలిగివునాడని ఫిర్యాదు అందటంతో సోధాలు నిర్వహించి నింధితుడిని అదుపులోకి తీసుకోవటంతో పాటు అతని నుంచి 96 మద్యం బాటీలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి సబ్ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

200 మందికి వైద్య పరీక్షలు

తెనాలి, మారీసుపేట మే 5: స్థానిక బోసురోడ్డులోని శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో ఆదివారం తెనాలి పట్టణ ఆర్యవైశ్య సంఘం, గుంటూరు వేదాంత హస్పటల్స్ వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా న్యాయవాది దరిశి శివకోటేశ్వరరావు పారంభించారు. శిబిరంలో వైద్యులు గుండె, కిడ్నీ రోగులకు జీపి, షుగర్, ఈసీజీ, బిఎండి రోగ నిర్ధారణ పరీక్షలను సుమారు 200మందికి నిర్వహించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు అచ్యుత సాంబశివరావు, డాక్టర్‌లు చింతా రామకృష్ణ, ఎం శ్రీరామ్, పి శ్రీనివాస్, మదన్ కుమార్‌లు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

తెనాలి, మారీసుపేట మే 5: స్థానిక బోసురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద అన్నదాత సుఖీభవ తెనాలి వారి ఆధ్వర్యంలో చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు. శనివారం అన్నదాత సుఖీభవ సభ్యులు ఓగిబోయిన సామ్రాజ్యం వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు ఓగిబోయిన మాధవరావు, శ్రీనివాసరావు, శంకరగాయత్రి జన్మదినం సందర్భంగా వారి కుటుంబ సభ్యుల సహకారంతో చల్లని మజ్జిగను పాదచారులకు, పట్టణ ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీవీ ప్రతాప్, కుర్రా శ్రీనివాసరావు, అబ్దుల్ రజాక్, పోతరాజు శ్రీను, సంఘ సభ్యులు పాల్గొన్నారు.